Pubilshed from Kakinada
PRGI NO : APTEL/25/A1470

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




| కాకినాడ | సంపుటి : 02 | సంచిక : 205 | శనివారం | జూన్ 13, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| KAKINADA | Vol.No : 02 | Issue No : 205 | Saturday | 13 JUNE 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



# కూటమిది పాజిటివ్ పాలిటిక్స్..

## గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్



ప్రజాభూమి ప్రతినిధి,తిరుపత : 2024 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను గెలుపుగా కాకుండా... బాధ్యతగా భావిస్తూ పాలన మొదలు పెట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెండేళ్ల పాలనపై ప్రజల్లో నమ్మకం కలిగింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన కొనసాగిస్తామని సీఎం వెల్లడించారు. శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గం దామినీడులో రెండేళ్ల పాలనపై జరిగిన విజయోత్సవ సభకు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం పేరుతో చేపట్టిన ఈ సభలో పవన్ కళ్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

- నాడు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు..
- నేడు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- రాజధానిపై మూడు ముక్కలాట..
- మావిగనో..? వాటికనో..?
- ప్రజల నమ్మకాన్ని పొందాం..నిలబెట్టుకుంటాం
- ఎంతో చేశాం... మరింతగా అభివృద్ధి చేస్తాం
- కేంద్ర సాయాన్ని, ప్రధాని మోదీ చేయూతను మరువలేం
- మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధం
- ఎమ్మెల్యేలు ప్రజా సేవకులే కానీ పెత్తందారులు కాదు
- ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టను... చర్యలుంటాయ్
- 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి

సుపరిపాలనలో భాగంగా అందిస్తున్న సేవలను సభావేదికగా చెప్పారు. ఇక రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటున్న కేంద్రం.. చేయూతనందిస్తున్న ప్రధాని మోదీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రెండేళ్ల కాలంలో డబుల్ ఇంజిన్ సర్కార్ చేసిన ప్రగతిని వివరించడంతోపాటు... రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలపైనా అప్రమత్తంగా ఉండాలని సీఎం హెచ్చరించారు. ఇక ప్రజా ప్రతినిధులు పెత్తందార్లుగా కాకుండా.. ప్రజా సేవకులుగా మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రెండేళ్ల క్రితం ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్రాన్ని గెలిపిద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ఇచ్చిన పిలుపునకు మద్దతు పలికారు.

2 పేజీలో..



# నావికుల మృతిపై ప్రధాని మాట్లాడాలి

## రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : గతవారం అమెరికా బలగాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టిబెల్లో' నౌకపై చేసిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. ఈ ఘటనపై ప్రధాని మౌనం వహించడంపై శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, 'అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన దాడుల్లో మూడు రోజుల్లోనే ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకు లొంగిపోయిన మన ప్రధాని మాత్రం ఇప్పటివరకు ఈ ఘటనపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు ప్రధాని స్పందించాలి. కానీ, ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరం. మన నావికుల్ని హత్య చేసిన కొద్దిరోజులకే..

- మిగతా 2లో..



# ముడిచమురు సరఫరాలో అంతరాయం

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు
- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం

న్యూఢిల్లీ : పశ్చిమాసియా పరిణామాల తో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది.

ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగ దారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- మిగతా 2లో..

# జగన్ పేరులో ఉన్న 'జీ' అంటే జెన్ జీ కాదు.. గొడ్డలి..

## విధ్వంసమే ఆయన అజెండా

2 లో..

- చిన్నప్పుడు టీచర్లు కొట్టారనే కోపంతోనే జగన్ వాళ్లపై కక్షగట్టాడు
- రూ.లక్ష కోట్లతో మిషన్ రాయలసీమ ప్రాజెక్టు చేపట్టబోతున్నాం!
- జగన్ తెచ్చిన కంపెనీలు ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్, గోల్డ్ మెడల్
- డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు
- డీఎస్సీ విషయంలో జగన్ చేస్తున్న ఆరోపణలు అంబేద్కర్ రాజ్యాంగంపైన
- తిరుపతి కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభలో మంత్రి నారా లోకేష్



ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి:
రాయలసీమను రాయల్ సీమగా మార్చడమే ఎన్డీయే లక్ష్యం. లక్షకోట్లతో చేపట్టబోయే మిషన్ రాయలసీమ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం కాబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలిసి లోకేష్ హాజరయ్యారు.

# మమతా బెనర్జీపై కోల్‌కతాలో ఎఫ్ఐఆర్



## నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో మమతపై ఓ స్థానికుడి ఫిర్యాదు

- ఓ బహిరంగ కార్యక్రమంలో మతపరమైన విభేదాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారన్న ఫిర్యాదుదారుడు
- సమాజంలో వైషమ్యాలు పెంచేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని ఫిర్యాదు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై కోల్‌కతాలో ఎఫ్ఐఆర్ నమోదైంది. దక్షిణ కోల్‌కతాలోని నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ స్థానికుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు సమాచారం.గత మార్చిలో ధర్మతలలో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో మమత చేసిన వ్యాఖ్యలు మతపరమైన విభేదాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఫిర్యాదుదారుడు ఆరోపించారు. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు సమాజంలో భయాందోళనలు, వైషమ్యాలు పెంచేలా ఉన్నాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. మే నెలలో ఫిర్యాదు అందగా, తాజాగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు కూడా టీఎంసీకి సవాళ్లను తెచ్చిపెడుతున్నాయి.

2 పేజీలో..

- ఏపీ పునర్నిర్మాణానికి కూటమి కట్టుబడి ఉంది: పవన్ కల్యాణ్
- ప్రజాస్వామ్యంలో తుది నిర్ణేతలు ప్రజలేనన్న పవన్
- రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కూటమి ఏర్పడిందని స్పష్టీకరణ
- ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకున్నామని వ్యాఖ్య

# ప్రజల తీర్పే చరిత్రను మార్చింది..



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని, వారి తీర్పును మించిన శక్తి ఏదీ లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం ప్రభుత్వ మార్పునకు మాత్రమే పరిమితం కాలేదని, రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దిశను నిర్దేశించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి సమీపంలోని దామినేడులో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం' బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

- మిగతా 2లో..



## ఢిల్లీలో ఎలక్ట్రిక్ స్కూటర్ పేలి

# ముగ్గురు మృతి

న్యూఢిల్లీ : ఢిల్లీలో బహుళ అంతస్తుల భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న ఎలక్ట్రిక్ వాహనం పేలి దానివల్ల కమ్ముకున్న పొగకు ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఆగ్నేయ ఢిల్లీలోని తుగ్లకాబాద్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న ఐదు అంతస్తుల భవనంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పంకజ్ (28), అతని తల్లి గుడ్డి (50), సోనీ (20) మృతి చెందారు. ఈ ప్రమాదంలో పంకజ్ సోదరి మోని, అతని 70 ఏళ్ల అమ్మమ్మ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం తెల్లవారుజామున 2.31 గంటల సమయంలో గోవింద్‌పురి పోలీస్ స్టేషన్‌కి సమాచారం అంది.

2 పేజీలో..

# రెండేళ్లలోనే బాబు పాలనపై జనం విసిగిపోయారు

## సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను చంద్రబాబు దగా

### వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి: సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను చంద్రబాబు దగా చేశారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా చంద్రబాబు పాలనలో దోపిడీ, హింస కొనసాగుతోంది.

- మిగతా 2లో..

## ‘రెండేళ్లలోనే బాబు పాలనపై
# జనం విసిగిపోయారు’

చంద్రబాబుకు రాజకీయంగా ఇదే లాస్ట్ టర్మ్. చంద్రబాబు పాలన అవినీతిలో కొత్త రికార్డులు సృష్టిస్తోందన్నారు. “సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజల్ని దగా చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన రోజు నుంచే మోసాలు మొదలయ్యాయి. ఎన్టీఆర్‌ను గద్దెదించి చంద్రబాబు సీఎం పీఠమెక్కారు. వైఎస్సార్ ఆదర్శవంతమైన పాలన అందించారు. వైఎస్ జగన్ ఆచరణలో మంచి పాలన తీసుకొచ్చారు. చంద్రబాబు పాలనలో మార్పు వస్తుందని ఆశించాం.. కానీ అది జరగలేదు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను చంద్రబాబు దగా చేశారు. చంద్రబాబు జీవితమంతా ప్రజలను వంచించడమే. రాష్ట్రంలో ప్రతి వర్గాన్ని చంద్రబాబు మోసం చేశారు. చంద్రబాబు పాలనలో ప్రజలంతా విసిగిపోయి.. వైఎస్ జగన్ వైపు చూస్తున్నారు. ప్రజల గొంతుక వినిపించేలా ఇవాళ నిరసనలు బ్రహ్మాండంగా జరిగాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా రోడ్డు మీదకు వస్తున్నారు. కూటమి సర్కార్ నిరసనలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. పోలీసులతో నిరసనలను అణచివేయాలని చూశారు. పోలీసుల ఆంక్షలను దాటుకుని ప్రజలు నిరసనలను విజయవంతం చేశారు” అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## ప్రజల తీర్పే చరిత్రను మార్చింది..

ఈ సందర్భంగా చారిత్రక విజయానికి కారణమైన ప్రజలకు, కూటమి శ్రేణులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.“రెండేళ్ల క్రితం ప్రజలు మాకు కేవలం అధికారాన్ని ఇవ్వలేదు.. ఒక పెద్ద బాధ్యతను అప్పగించారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితం. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం కూటమి ఏర్పడింది. అధికారాన్ని పంచుకోవడం కోసం కాదు.. బాధ్యతను పంచుకోవడం కోసం ఈ కూటమి ముందుకొచ్చింది” అని పవన్ అన్నారు. జనసేన కేవలం 21 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, ప్రజల ఆశీర్వాదంతో అన్ని స్థానాల్లో విజయం సాధించడం తమపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధికి కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఎన్డీయే ప్రభుత్వ సమష్టి కృషి వల్ల విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోగలిగామని తెలిపారు. దేశంలో అత్యధిక కాలం నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఇటీవల జరిగిన విశాఖ స్టీల్ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని పవన్ పేర్కొన్నారు. ఆ దుర్ఘటన కారణంగానే ఈ నెల 9న జరగాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## ముడిచమురు సరఫరాలో అంతరాయం

దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది. పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

## నావికుల మృతిపై ప్రధాని మాట్లాడాలి

అంటే వచ్చేవారమే జీ7 సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో మోదీ గారు చిరునవ్వు చిందిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ.. ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ చనిపోయిన ఈ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్కమాట కూడా మాట్లాడరు. తమ ప్రాణాలను బలిగొన్న వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ లేని ఒక లొంగిపోయిన ప్రధానమంత్రి ‘భారతమాత’ బిడ్డలను రక్షించలేరు’ అని మోదీ తన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోదీని తీవ్రంగా విమర్శించారు.

## మమతా బెనర్జీపై కోల్‌కతాలో ఎఫ్ఐఆర్

ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీలో అంతర్గతంగా అసంతృప్తి పెరుగుతోందనే చర్చ సాగుతోంది. కొందరు నాయకులు పార్టీకి దూరమవుతుండగా, మరికొందరు తమ రాజకీయ భవిష్యత్తుపై కొత్త నిర్ణయాలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో నెలకొన్న ఈ పరిణామాలు మమతా బెనర్జీ నాయకత్వానికి పరీక్షగా మారాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు చట్టపరమైన వివాదాలు, మరోవైపు పార్టీ అంతర్గత అసంతృప్తి నేపథ్యంలో టీఎంసీ భవిష్యత్‌పై చర్చ మరింత వేడెక్కుతోంది. ఈ పరిస్థితుల్లో మమతా బెనర్జీ తదుపరి రాజకీయ వ్యూహం ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## ఢిల్లీలో ఎలక్ట్రిక్ స్కూటర్ పేలి ముగ్గురు మృతి

వెంటనే ఘటనా స్థలానికి స్థానికులు, పోలీసులు చేరుకున్నారని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అలాగే రెస్క్యూ సిబ్బంది నాలుగు అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. టెర్రస్ గేటను పగలగొట్టి అగ్నిమాపక సిబ్బంది ఎనిమిది మందిని కాపాడారు. వీరిలో ఇద్దరు బాలికలు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. గ్రౌండ్ ఫ్లోర్ పార్కింగ్ ఏరియాలో ఉన్న ఎలక్ట్రిక్ స్కూటర్‌కి ఛార్జింగ్ పెట్టిన సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల ఆ స్కూటర్ పేలిపోయింది. ఆ మంటలు పక్కనున్న వాహనాలకి అంటుకుని మూడు స్కూటర్లు, రెండు మోటార్‌సైకిళ్లు, ఓ సైకిల్ అగ్నికి ఆహుతయ్యాయని ప్రాథమిక విచారణలో తేలినట్లు డిఎఫ్ఎస్ అధికారులు వెల్లడించారు. వరుస వాహనాలు కాలిపోవడం వల్ల దట్టమైన పొగ కమ్ముకుని ఆ భవనం అంతా వ్యాపించింది. ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లో తీవ్రంగా పొగ అలుముకుంది. ఈ పొగ వల్ల ఈ ఫ్లోర్‌ల్లో ఉన్నవారికి ఊపిరాడక ముగ్గురు మృతి చెందారు. పై అంతస్తుల్లో వారికి అంత ప్రభావం చూపలేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# జగన్ పేరులో ఉన్న ‘జీ’ అంటే జెన్ జీ కాదు..గొడ్డలి..

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాయల్ ఎన్ ఫీల్డ్, క్యారియర్, ఎల్ జీ, రిలయన్స్ సీమకే వచ్చాయి. ఇది రాయలసీమపై మాకు ఉన్న నిబద్ధత. టీడీపీ, జనసేన, బీజేపీ... మనది పెద్ద కుటుంబం. రాష్ట్రం కోసం, ప్రజల కోసం అందరూ కలిసి పనిచేయాలి. ఇగోలు వద్దు, ఏదైనా సమస్య ఉంటే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. కూటమి ధర్మాన్ని అందరూ పాటించాలి. అహంకారం వద్దు...అహంకారం వల్లే వాళ్లకి 151 - 11 అయ్యాయి. ప్రజల్లోకి చేసిన, చేస్తున్న మంచి పనులు చెబుతామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

**ప్రజాప్రభుత్వంలో ప్రశాంతంగా జనం :** కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజాప్రభుత్వం రెండేళ్ళు పూర్తిచేసుకుంది. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు ప్రశాంతత వచ్చింది. దాడులు లేవు, జేసీబీలు, కబ్జాలు, హత్యలు, బెదిరింపులు, బూతులు కూడా లేవు. రాష్ట్రంలో ఉన్నది ఒక్కటే ప్రశాంతత. ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది...ప్రశాంతంగా ఉన్నారు. తిరుపతి వచ్చిన తరువాత నాకు ఒక విషయం గుర్తొచ్చింది. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇదే చంద్రగిరి గడ్డపై నేను ఒక మాట చెప్పాను. వెంకన్న చాలా పవర్ ఫుల్...అయనతో పెట్టుకోవద్దు... మాడి మసై పోతావు అని జగన్ కి చెప్పాను. ఆయనకి అర్ధం కాలేదు..డైరెక్ట్ గా స్వామితోనే పెట్టుకున్నారు. 2024లో ఏం జరిగిందో మీరంతా చూశారు. విశ్వ విఖ్యాత నట సార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారికి సీమ అంటే ప్రేమ. రాయలసీమకు కరువు వస్తే జోలె పట్టి ప్రజలను ఆదుకుంది ఎన్టీఆర్. తెలుగు గంగ, గాలేరు - నగరి ప్రాజెక్ట్ రూపకల్పన చేసింది ఎన్టీఆర్. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ, ?50 హార్స్ పవర్ విద్యుత్, తిరుమలలో నిత్య అన్నదానం ప్రారంభించింది ఎన్టీఆర్.

**రాజకీయాల్లో విరాట్ కోహ్లీ సీబీఎన్ :** రాజకీయాల్లో విరాట్ కోహ్లీ మన సీబీఎన్. అవతల వైపు బౌలర్లు మారతారు తప్ప ఇటు వైపు ఒకే ఒక్క బ్యాట్స్‌మన్ సీబీఎన్. అటువైపు బౌలర్ ఎవరైనా ఇటు సూపర్ సిక్స్ కొట్టేది మాత్రం మన సీబీఎన్. రాయలసీమను రాయల్ సీమగా మార్చేసింది మన సీబీఎన్. అప్పుడు కియా...ఇప్పుడు రాయల్ ఎన్ ఫీల్డ్. డ్రిప్ ఇరిగేషన్ తో సీమలో బంగారం పండేలా చేసింది మన సీబీఎన్. హంద్రీ - నీవా సుజల స్రవంతి ద్వారా కుప్పానికి నీళ్లు ఇచ్చింది మన సీబీఎన్. పులివెందులకు కూడా నీళ్లు ఇచ్చింది మన సీబీఎన్. ఇప్పుడు లక్షకోట్లతో మిషన్ రాయలసీమ స్టార్ట్ చేస్తుంది మన సీబీఎన్.

**ప్రజలే వారిని రఫ్ఫాడిస్తారు...**2019 నుండి 2024 వరకు గొడ్డలి పార్టీ అరాచక పరిపాలన మనం చూశాం. బీసీ బిడ్డ అమర్‌నాథ్ గౌడ్ పై పెట్రోలు పోసి చంపేశారు. దళిత వైద్యుడు సుధాకర్ గారిని పిచ్చోడని ముద్ర వేసి చంపేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపేసి డోర్ డెలివరీ చేశారు. అబ్దుల్ సలామ్ కుటుంబంతో సామూహికంగా ఆత్మహత్య చేసుకునేలా చేశారు. కుటుంబాన్ని విడిచి మిస్బా ఆత్మహత్య చేసుకునేలా చేశారు. టీడీపీ జెండా లేకుండా చేస్తాం అన్నారు, ప్రజలే వాళ్ల జెండా పీకేశారు. వై నాట్ 175 అన్నారు. ప్రజాలు టీమ్ 11 ఇచ్చారు. వాళ్లు సిద్ధం అంటే...ప్రజలు యుద్ధం అన్నారు. మమ్మల్ని అసెంబ్లీలో అడుగు పెట్టనివ్వం అన్నారు, ప్రజలే వాళ్లని అసెంబ్లీలో అడుగు పెట్టకుండా చేశారు. ఇప్పుడు రప్పా రప్పా అంటున్నారు -- ప్రజలే రఫ్ఫాడిస్తారు.

**రెండేళ్లుగా సుపరిపాలన అందించాం :** ప్రజా ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో సుపరిపాలన అందించాం. అన్నీ చేసేశామని కాలర్ ఎగరేయడం లేదు. ఆర్థిక ఇబ్బందులున్నా దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. రూ.2వేల పెన్షన్ ఒకేసారి రూ.4వేలకు పెంచాం. అన్నా క్యాంటీన్లు, డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీ, 6వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ, ఇప్పుడు జాబ్ క్యాలండర్ ద్వారా 10,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. అదేవిధంగా చేనేతలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ కి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాం. ఆటోవాలా సేవలో, మత్స్యకార సేవలో, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి ఉచిత బస్సు, దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలండర్ల అందజేత, ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం వంటివి అమలు చేస్తూ జనరంజక పాలన అందిస్తున్నాం.

**జగన్ పేరులో జీ అంటే గొడ్డలి! :** ప్రజా ప్రభుత్వ నినాదం ఒక్కటే. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ. దేశంలోకి వచ్చిన ప్రతివందలో 25శాతం పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ కే వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి బడా సంస్థలు ఉత్తరాంధ్రకు క్యూ కట్టాయి. రాజధాని ప్రాంతంలో ప్రతిష్టాత్మకమైన క్వాంటమ్ వ్యాలీ ఆవిష్కృతమవుతోంది. రాయలసీమకు ఎవరూ ఊహించని విధంగా ఫైటర్ జెట్స్ పరిశ్రమను, రాయల్ ఎన్ ఫీల్డ్ ను రప్పించాం. మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్ జెట్స్... వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా... వాళ్లది కిడ్నాప్. మనది విశ్వసనీయత... వాళ్లది నేరం. మనది అభివృద్ధి... వాళ్లది విధ్వంసం. మనది బుల్లెట్... వాళ్లవి బూతులు... మనది మహిళలకు 33% రిజర్వేషన్ ... వాళ్లది సొంత తల్లిని, చెల్లిని గెంటేయడం. జగన్ అనే పేరులో ఉన్న జీ ని జెన్ జీ అనుకుంటున్నాడు. కానీ జగన్ లో ఉన్న జీ అంటే గొడ్డలి.

**ఆయనకు సీసీడీ జబ్బు ఉంది :** జగన్ కి సీసీడీ అనే జబ్బు ఉంది. సీసీడీ అంటే క్రెడిట్ చోరీ డిజార్డర్. మేము కష్టపడి గూగుల్ తీసుకువస్తే... ప్రెస్ మీట్ పెట్టి వాళ్ల వల్లనే గూగుల్ వచ్చింది అని అన్నారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్ కి వస్తుంది అని పేపర్ లో వస్తే.. రావడం లేదు అని ప్రెస్ మీట్ పెట్టి మరీ చెప్పారు. దాని భూమి పూజ తర్వాత నేనే తెచ్చాను అని ప్రెస్ మీట్ పెట్టి మాట తప్పాడు, మడమ తిప్పాడు. ఇంకా కొంచెం టైమ్ ఇస్తే ఆగస్ట్ 15న ప్రెస్ మీట్ పెట్టి భారత దేశానికి స్వతంత్రం తెచ్చింది మా తాత అని ప్రకటిస్తాడు సీసీడీ జగన్. జగన్ తెచ్చిన కంపెనీలు కొన్ని ఉన్నాయి, అవి ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్, గోల్డ్ మెడల్.

**అపట్లో టీచర్లు కొట్టారనే జగన్ కు కోపం :** చిన్నపుడు 10వ తరగతి పేపర్ లీక్ లో దొరికితే వాళ్ల టీచర్లు జగన్ ను చితగ్గొట్టారు. అందుకే జగన్ కి టీచర్స్ అంటే కోపం. ఉపాధ్యాయులను మద్యం దుకాణాలు ముందు నిలబెట్టిన చరిత్ర జగన్ ది. మెగా డీఎస్సీ ని అడ్డుకోడానికి 226 కేసులు వేశారు. 150 రోజుల్లో మనం మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 పోస్టులు భర్తీచేశాం. ఇందులో ఏదో జరిగిందని బురద జల్లుతున్నారు. ఈ విషయంలో జగన్ నన్ను, సీబీఎన్ గారిని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదు. అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తున్నారు. రిజర్వేషన్లను ప్రశ్నిస్తున్నారు. జగన్ మీరు ఎన్ని జన్మలు ఎత్తినా డీఎస్సీని ఆపలేరు. నేను పాదయాత్రలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాను. జగన్ కి కనీసం దేశం భక్తి కూడా లేదు. మేము సాగర్ డిఫెన్స్ కంపెనీ తీసుకొస్తే దాని మీద కూడా నకిలీ ప్రచారం చేశారు. సాగర్ రక్షణ సంస్థ దేశ రక్షణ కోసం బోట్లు తయారు చేస్తుంది. కనీసం 1000 మంది మత్స్యకార పిల్లలకు ఉద్యోగాలు కల్పించేందుకు సాగర్ సంస్థను మేము తీసుకొని వస్తే అనేక ఆరోపణలు చేసి ఆ కంపెనీని కూడా తరిమేయాలని ప్రయత్నించారు.

**స్టీల్ ప్లాంట్ ను కాపాడిన చరిత్ర ఎన్డీయేది :** ఇప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడుతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఇబ్బందుల్లో ఉంటే రెండుసార్లు కాపాడిన చరిత్ర ఎన్డీయేది. స్టీల్ ప్లాంట్ క్లోజ్ చేసి అక్కడ రాజధాని కడదామనే ఆలోచన మీది. మొన్న స్టీల్ ప్లాంట్ లో ప్రమాదం జరిగింది. కొంత మంది కార్మికులు చనిపోయారు. చనిపోయిన పర్మినెంట్ ఉద్యోగి కుటుంబానికి ప్రజా ప్రభుత్వం రూ.2కోట్లు ఇస్తుంది. కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబానికి ఒకకోటి ఇస్తుంది. అంతే కాకుండా పర్మినెంట్ జాబ్ కుడా మేము ఇస్తున్నాము. ఎవరైనా ఎక్కువ ఇవ్వమని అడగొచ్చు. కానీ, జగన్ కోటి ఇవ్వమని డిమాండ్ చేశారు.

**నమో వల్లే మనకు గౌరవం :**

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మనకి గౌరవం దక్కుతుంది. ప్రపంచం మొత్తం మన దేశం వైపు చూస్తుంది. దానికి కారణం మన గౌరవ ప్రధాని నమో...నరేంద్ర మోదీ గారు. ఆయన రికార్డ్స్ బద్దలు కొట్టడం ఎవరి వల్లా సాధ్యంకాదు. దేశం మొత్తం నమో అంటే నరేంద్ర మోడీ. ఏపీలో మాత్రం నమో అంటే నాయుడుజీ, మోడీజీ. అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉన్నాయి. కానీ, ఆంధ్రప్రదేశ్ లో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, అమరావతి, పోలవరానికి నిధులు, ఫైటర్ జెట్, చావీజూా ప్రాజెక్ట్ వచ్చాయి. త్వరలో కర్నూలుకి హైకోర్టు బెంచ్ ని డబుల్ ఇంజిన్ బుల్లెట్ సర్కార్ తీసుకురాబోతోందని మంత్రి లోకేష్ చెప్పారు.

## కూటమిది పాజిటివ్ పాలిటిక్స్...
# గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్

57 శాతం ఓట్ షేర్ తో ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. 164 సీట్లతో ఎన్డీఏకు అధికారాన్ని అందించారు. 2024 ఫలితాలను గెలుపుగా కాదు రాష్ట్ర పునర్నిర్మాణానికి అప్పజెప్పిన బాధ్యతగా భావించాం. పాలకులుగా కాకుండా సేవకులుగా పని చేస్తున్నాం. అధికారం చేపట్టే సమయానికి అన్ని రంగాల్లో సంక్షోభం-వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం రూ.10 లక్షల కోట్ల అప్పుతో ముగిసింది. కేంద్ర పథకాలను, సాగునీటి పథకాలను నిర్వీర్యం చేశారు. ఇన్వెస్టర్లను వెంటాడి వేటాడి తరిమేశారు. యువత భవిష్యత్తును దెబ్బ తీశారు. ప్రశ్నించిన ప్రజలను వేధించారు. నన్ను అక్రమంగా జైల్లో పెట్టారు. పవన్ కల్యాణ్ ను ఇబ్బందులు పెట్టారు. మేం కుంగిపోకుండా, వెనకడుగు వేయకుండా పనిచేసి ప్రజల కోసం నిలబడ్డాం. రాష్ట్ర దుస్థితిని చూసి భయపడకుండా 7 శ్వేత పత్రాలు విడుదల చేసి ప్రజలకు వాస్తవ విషయాలు తెలియచేసాం. ప్రజలు చూపిన విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కార్ గెలిచింది. రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలు విజ్ఞత చూపారు. ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టాం. ఎన్డీఏ ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాం.”అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**గత ప్రభుత్వంలో ఎన్నో అవకాశాలను పోగొట్టుకున్నాం :**
“2019-24 మధ్య కాలంలో ఐదేళ్ల పాటు ఏపీ అవకాశాల్ని పోగొట్టుకుంది. విధ్వంసాన్ని సరి చేసేందుకు ఒక్కో అడుగూ ముందుకు వేస్తున్నాం. ప్రజల సేవకు పునరంకితం కావడానికే ఈ విజయోత్సవ సభను నిర్వహించుకుంటున్నాం. విమర్శలకు ఆధారాలతో సహా సమాధానం చెప్పే గుండె ధైర్యం ఎన్డీఏ ప్రభుత్వానికి ఉంది. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలన ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చాం. ఇచ్చినట్టే పాలన అందిస్తున్నాం. సూపర్ సిక్స్ తో పాటు మేనిఫెస్టోలో హామీల అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని సాధించాం. ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ.65 వేల కోట్ల పెన్షన్లు, తల్లికి వందనం ద్వారా చిన్నారులకు చదువు చెప్పిస్తున్నాం. స్త్రీశక్తి ద్వారా 71 కోట్ల ఉచిత ప్రయాణాలు కల్పించాం. అన్నదాత సుఖీభవ కింద కేంద్రంతో కలిసి రూ.20 వేలు ప్రతీ రైతుకూ అందించాం. 24 గంటల్లోనే ధాన్యం కొనుగోళ్ల డబ్బులు చెల్లిస్తున్నాం. గీత కార్మికులు, వడ్డెర్లు, అర్చకులు, ఇమామ్ లు, మౌజన్లు ఇలా అందరినీ గుర్తుపెట్టుకుని మరీ సంక్షేమం అందిస్తున్నాం. ఎస్సీ,ఎస్టీ, బీసీల సహా అందరికీ సబ్సిడీపై సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. పీ4 ద్వారా సమాజంలో జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. విద్య వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ సంజీవని ప్రాజెక్టు చేపట్టాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది టీచర్ పోస్టుల భర్తీతో పాటు 5757 మంది కానిస్టేబుళ్లను కూడా నియమించాం. ఉద్యోగులకు 23 నెలల్లో రూ.21 వేల కోట్ల బకాయిలు చెల్లించాం. అప్పులు చేసే వ్యక్తికి, ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టిన వ్యక్తికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదు. ఎమ్మార్వో ఆఫీసు, ఆస్పత్రి, మద్యంపై వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టుకు పెట్టారు. యావత్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన వ్యక్తికి రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత ఉందా..? మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలు ఆట ఆడిన వ్యక్తులకు ప్రజల గురించి మాట్లాడే అర్హత లేదు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను, అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తున్నాం. 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. గత పాలకుల హయాంలో పెట్టుబడి దారులు రాష్ట్రం నుంచి పారిపోయారు. మళ్లీ ఏపీ బ్రాండ్ పునరుద్ధరించి పెట్టుబడుల్ని, ప్రాజెక్టుల్ని సాధిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నాం. వివిధ పారిశ్రామిక పాలసీల ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కల్పించాం... అందుకే పెట్టుబడులు వస్తున్నాయి. కేవలం 36 రోజుల్లోనే రాయలసీమలోని పుట్టపర్తికి 5వ జనరేషన్ ఫైటర్ జెట్ యుద్ధ విమాన ప్రాజెక్టుకు అనుమతులిచ్చాం. రాయలసీమ ఇక హార్టీ కల్చర్ హబ్. ఇక్కడికే



స్పేస్, డ్రోన్, డిఫెన్సు పరిశ్రమలు వస్తున్నాయి. తిరుపతి జిల్లాలో రాయల్ ఎన్ ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ ఏర్పాటు అవుతోంది. కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గని నుంచి తవ్వకాలు ప్రారంభం అవుతాయి. గత పాలకులు చేసిన విధ్వంసం నుంచి ఇప్పుడు రాష్ట్రాన్ని నిలబడుతున్నాం. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ అందించాం. ఏపీని అగ్రస్థానంలో... అందరికీ ఆదర్శంగా నిలిపేందుకు అంతా కలిసి కృషి చేయాలి.”అని సీఎం చంద్రబాబు సూచించారు.

**అభివృద్ధి చేస్తుంటే... అడుగడుగునా అడ్డుకుంటున్నారు :**
“రాయలసీమ ప్రాంతంలోని వివిధ ఖనిజాల ద్వారా వేర్వేరు పరిశ్రమలు వస్తాయి. 100 రోజుల్లోనే హంద్రీ-నీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తెచ్చాం. కల్యాణి డ్యామ్ కూడా పూర్తి చేసి శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వద్దకు నీళ్లు తెస్తాం. గత పాలకులు తిరుమల ప్రసాదాన్ని కల్తీ చేసి అపవిత్రం చేశారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల అపచారం చేసి మన అందరి మనోభావాలను దెబ్బతీసేలా గొడ్డలి పార్టీ ప్రవర్తించింది. తిరుమల జోలికి బ్రిటీషర్లు కూడా వెళ్లలేదు. కానీ గొడ్డలి పార్టీ ఆ దుర్మార్గం చేసింది. ప్రజలకు న్యాయం చేయాలన్నదే జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల లక్ష్యం. విశాఖకు, గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి ఐటీ కంపెనీలు వస్తే, అమరావతికి క్వాంటం వ్యాలీ వస్తోంది. ఏపీకి పరిశ్రమలు రావాలి... మన రాష్ట్రం పురోగతి సాధించాలి. మన యువతకు ఉద్యోగాలు రావాలి. అందుకే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కూడా మన యువతకు కల్పిస్తున్నాం. అడ్డగోలుగా జిల్లాలను విభజించారు. దానిని సరిచేసి మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రీసర్వే ప్రక్రియ ద్వారా భూ వివాదాలకు చెక్ చెబుతున్నాం. భూ రికార్డులను ప్రక్షాళన చేసేలా కార్యక్రమం చేపడుతున్నాం. దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామంలో భూ వివాదాలకు చెక్ పెట్టాం. చెత్త పన్ను రద్దు చేయటంతో పాటు రాష్ట్రంలో చెత్తను, పరిపాలనలో చెత్తను కూడా తొలగిస్తున్నాం. పరిపాలనకు అడ్డంకులు కల్పించే కొన్ని పాత చట్టాలను రద్దు చేసి పాలనా సమర్థత పెంచుతున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచలేదు. తొలిసారి ట్రూ డౌన్ చేసి విద్యుత్ ఛార్జీలు తగ్గించాం. రూ.4,668 కోట్ల భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించింది. విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 2047 స్వర్ణాంధ్ర దిశగా ఏపీ ముందుకు వెళ్తుంటే గొడ్డలి పార్టీ వెనక్కు లాగే ప్రయత్నం చేస్తోంది. పూర్తి పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటుంటే లేని పోని దుష్ప్రచారం ఆ పార్టీ చేస్తోంది. గొడ్డలి పార్టీ ఫేక్ న్యూస్ తో విష ప్రచారాలు చేస్తోంది. మద్య నిషేధం చేసి ఓటు అడుగుతానన్న వ్యక్తి ఏం చేశారో అందరికీ తెలుసు. జే బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశారు. మహిళల మంగళసూత్రాలు తెంచారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి అధికారంలో ఎన్ని వారాలు ఉన్నారో అందరికీ తెలుసు. జాబ్ క్యాలెండర్ అని ఘనంగా ప్రకటించి ఒక్కసారి కూడా విడుదల చేయలేక పోయింది గొడ్డలి పార్టీ. అమరావతిపై ఊసరవెల్లి రాజకీయాలు చేశారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కల ఆటలాడారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారు... అది మావిగనో వాటికనో..? వైసీపీ ఫేక్ న్యూస్ ను నమ్ముకుంటే... మేం ప్రజలను నమ్ముకున్నాం. ఫ్రస్టేషన్ తో గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. కూటమిది పాజిటివ్ పాలిటిక్స్... గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్. ప్రజా ప్రభుత్వానికి ప్రజలే ఫస్ట్, దేశం- రాష్ట్రమే కూటమి అజెండా. దేశంలో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే అభివృద్ధి ఆటోమేటిక్ గా జరుగుతుంది. తాము పెత్తందార్లు కాదు, ప్రజలకు సేవకులమనే విషయాన్ని ప్రతి ఒక్క ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలి. ఎన్డీఏ కూటమిపై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఓ బ్లూ ప్రింట్ మన దగ్గర ఉంది. రెండేళ్ల క్రితం ఇదే రోజు సుపరిపాలనలో ఓ హంబుల్ బిగినింగ్ చేశాం. మేనిఫెస్టో అమలుపై చర్చించడానికి నాతో పాటు ఎన్డీఏ కూటమిలోని ప్రతీ కార్యకర్తా సిద్ధమే. నా దేశం - నా బాధ్యత అనే ఆలోచనతోనే మనం అంతా పని చేయాలి. ప్రజా ప్రభుత్వం అనుక్షణం ప్రజల గురించే ఆలోచిస్తుంది. అభివృద్ధికి, సుపరిపాలనకు పునరంకితం అయ్యేలా సంకల్పం తీసుకుందాం. త్వరలోనే మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించిన ట్రాక్ రికార్డు ప్రజా ప్రభుత్వానిది విధ్వంసం చేసిన రికార్డు గొడ్డలి పార్టీది.”అని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు.

**దేశానికి దిశా నిర్దేశంలా మోదీ 12 పాలన :** “రాష్ట్రానికి కేంద్రం సహకారం అందిస్తోంది. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా వివిధ అంశాల్లో కేంద్రం అండగా నిలిచింది. ప్రధానిగా నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్నందుకు ఆయనకు అభినందనలు. మోదీ 12 ఏళ్ల పాలన దేశాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించేలా చేసింది.. భవిష్యత్తుకు పునాదులు వేసింది. వరుసగా మూడు సార్లు మోదీకి మద్దతుగా నిలవటం వల్లే దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్తోంది. 25 కోట్ల మంది పేదలు పేదరికం నుంచి విముక్తి కల్పించిన నేత ప్రధాని మోదీ. 1.46 లక్షల కిలోమీటర్ల జాతీయ రహదారులు, 160 ఎయిర్ పోర్టులు నిర్మించారు. చంద్రయాన్, గగన్ యాన్ లాంటి ప్రాజెక్టులు దేశప్రతిష్టను పెంచాయి. ఆపరేషన్ సింధూర్ సైనిక శక్తిని ప్రపంచానికి చాటింది. పశ్చిమాసియాలో యుద్ధంతో రకరకాల ఇబ్బందులు వస్తున్నాయి. ప్రధాని మోదీ చేపట్టిన చర్యల కారణంగా అతి తక్కువ ద్రవ్యోల్బణం కలిగిన దేశంగా భారత్ ఉంది.”అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ప్రభుత్వ పథకాలతో**
**లబ్ధి పొందాం: లబ్ధిదారులు :** 2 ఏళ్ల పాలన విజయోత్సవ సభ సందర్భంగా వివిధ పథకాల లబ్దిదారులు తాము పొందిన లబ్దిని సభా వేదిక మీద నుంచి వివరించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా తాను పొందిన లబ్దిని.. తన అనుభవాన్ని ఉష అనే యువతి వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో తనకు కలిగిన మేలును చంద్రబాబు అనే రైతు చెప్పారు. తన ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం నిధులు తన ఖాతాలో జమ అయ్యాయని.. చక్కగా చదువుకుంటున్నారని తల్లికి వందనం లబ్దిదారు పులిచర్ల నాగమ్మ సంతోషంగా చెప్పారు. తనకు కూటమి ప్రభుత్వం ఇల్లును ఇచ్చిందని నాగమ్మ సభా వేదికగా వెల్లడించింది. రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ వీడియోను ప్రజెంట్ చేశారు. 2 ఏళ్ల కాలంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, ప్రాంతాల వారీగా జరిగిన అభివృద్ధిని అద్దం పట్టేలా వీడియోను రూపొందించారు. కేంద్రం అందించిన సాయాన్ని... ప్రధాని మోదీ అందిస్తోన్న సహకారాన్ని వివరిస్తూ వీడియోను ప్రజెంట్ చేశారు. స్వర్ణాంధ్ర సాధన దిశగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఎలా పని చేస్తున్నారనే విషయాలను క్రోడీకరిస్తూ వీడియో రూపకల్పన చేశారు. ఈ సభకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు హాజరయ్యారు.

# కూటమి ఎన్నికల హామీలు విఫలం




- ఐదేళ్లహయంలో చేసిన అప్పులు మించి కూటమి రెండేళ్లకే చేసింది
- రెండేళ్లు గడిచిన వృద్ధులకు పింఛన్లు లేవు
- నిరాశ్రయులకు ఇల్లు ఇళ్ల స్థలాలుపై దృష్టి పెట్టలేదు
- రాజ్యసభ సభ్యులు సుభాష్ చంద్రబోస్
- చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

**ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం**

ఎన్నికల సమయంలో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, వైసీపీ నేత,రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆ పార్టీ శ్రేణులు నియోజకవర్గం వ్యాప్తంగా భారీగా తరలిరావడంతో పట్టణంలో వైసీ శ్రేణుల సందడి నెలకొంది. లారీ యూనియన్ కార్యాలయం నుండి రాజగోపాల్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలో కూడా ఒక సంవత్సరం పాటు హామీలను వాయిదా వేద్దామన్నా జగన్మోహన్ రెడ్డి ఒప్పుకోలేదని నాడు రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగానే జగన్మోహన్ రెడ్డి పరిపాలన ఐదు సంవత్సరాలు పాటు నిరాటంకంగా సంక్షేమ అభివృద్ధి చేయగలరని బోసు తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఐదు సంవత్సరాలలో చేసిన అప్పులుకు మించి కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లోనే చేసిందని బోసు గుర్తు చేశారు. మరో మూడేళ్ల కాలంలో ఎన్ని లక్షల కోట్లు అప్పుచేసి రాష్ట్ర ప్రజలకు భారన్న మోపుతారని అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్చార్జి పిల్లి సూర్యప్ర కాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడి రెండేళ్ల కాలం పూర్తయినప్పటికీ వృద్ధులు , వికలాంగులు, వితంతువులకు పెన్షన్లు ,నిరాశ్రయులకు ఇళ్ల స్థలాలు వంటి సంక్షేమ పథకాలుపై ఇప్పటికీ కూటమి దృష్టి పెట్టలేదని విమర్శించారు. రామచంద్రపురం నుండి ఎలక్ట్రికల్ డివిజన్ కార్యాలయం తరలింపుపై స్థానిక మంత్రి స్పందించకపోవడాన్ని ఆయన ఖండించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం పరిధిలో గల రామచంద్రపురం కాజులూరు కే .గంగవరం మండలాల నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. ఈ సందర్భంగా కార్యక్రమం విజయానికి సహకరించిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు సూర్య ప్రకాష్ ఈసంధర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం



**ప్రజాభూమి ప్రతినిధి – కాజులూరు**

13 వ తేది శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గం"ల వరకు 33/11 కే వీ గొల్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలగనుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం అయినా ఒక ప్రకటనలో విషయాన్ని తెలియజేశారు 11 కేవీ శీల ఫీడర్ లో గల శలపాక ,తణుకువాడ , శీల, మంజేరు గ్రామాలు, 33/11 కేవీ ఇంజరశీ సబ్ స్టేషన్ పరిధి లోగ 11 కేవీ కోలంక ఫీడర్ పరిధిలో కోలంక ,పొలమూరిపాడు, చలివేంద్ర పాడు, 11 కేవీ ఇంజరశీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో గల ఆక్వా మరియు ఇండస్ట్రియల్ ఏరియాల విద్యుత్ వినియోగదారులకు ట్రీ ట్రిమ్మింగ్ పనులు భాగంగా సప్లై నిలిపివేయిదురు కావున విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా ఆయన పేర్కొన్నారు.

## విఆర్ పురంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం విజయవంతం



**ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం.**

ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం (టీడీపీ, జనసేన, బీజేపీ) అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, వైఎస్సార్‌సీపీ 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టింది, దీనిలో భాగంగా మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం భారీఎత్తున మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్ డీ ఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, రైతులు, మహిళలు, యువత, మరియు ఉద్యోగులను ప్రభుత్వం దగా చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు

### పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ లో శుక్రవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ముద్రించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ . వెట్రిసెల్వి. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి ఒక శాపమని, దీనిని పూర్తిగా నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మిక నిర్మూలన కోసం జిల్లా టాస్క్ ఫోర్స్ ( డిటిఎఫ్ )కమిటీకి చెందిన అన్ని శాఖలు, స్వచ్ఛంద సంస్థలు మరియు భాగస్వామ్య సంస్థలు సమన్వయంతో పనిచేయాలన్నారు. బాల కార్మిక నిషేధ చట్టాలపై అవగాహన కల్పిస్తూ, ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్



టోల్ ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించేలా ప్రజలలో అవగాహన కలిగించాలన్నారు. ప్రజల సహకారంతోనే బాల కార్మిక రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కార్మిక కమిషనర్, ఏలూరు పి. శ్రీనివాస్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సి డబ్ల్యు సి) చైర్మన్ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శారద, సహాయ కార్మిక కమిషనర్ జి. నాగేశ్వరరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్య చక్రవేణి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ పంకజ్ కుమార్, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగు శాఖలు పాటించి నిర్ణీత సమయంలోగా పనులు పూర్తిచెయ్యాలి

- ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖకు నిర్దేశించిన అంగన్వాడీ టాయిలెట్స్ నిర్మాణాలు వెంటనే పూర్తిచెయ్యాలి
- ఇంజనీరింగు శాఖలు నిర్మాణ పనులు ప్రగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్ష



**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

జిల్లాలో ఇంజనీరింగు శాఖలు ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు, బిల్లులు అప్లోడ్ పనులు నిర్ణీత సమయం లోగా పూర్తిచెయ్యాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంజనీరింగు శాఖలు ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు ప్రగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్షసమావేశాన్ని నిర్వహించారు. శాఖలు వారీగా సమీక్షించి ప్రగతిలో వెనుకబడిన అధికారులుపై జిల్లా కలెక్టరు దిశానిర్దేశం చేశారు. ఐసిడిఎస్, నీటిపారుదల శాఖలు అధికారులు సరైన సమాచారంతో హాజరు కానందున ఆగ్రహం వ్యక్తం చేస్తూ, షోకాజ్ నోటీసులు జారీ చెయ్యాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇంజనీరింగు శాఖలు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయంలోగా పూర్తి చెయ్యాలని అన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యాయని ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖకు నిర్దేశించిన అంగన్వాడీ టాయిలెట్స్ నిర్మాణాలు పూర్తి చెయ్యాలని ఆదేశించారు. పనులలో ప్రగతి చూపించని, బిల్లులు అప్లోడ్ లో నిర్లక్ష్యం వహించే అధికారులుపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇంజనీరింగు పనులలో ప్రగతి చూపించని, బిల్లులు అప్లోడ్ లో నిర్లక్ష్యం వహించే అధికారులుపై చర్యలు తీసుకుంటామని అన్నారు. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు సంఖ్యకు తగిన విధంగా సురక్షిత త్రాగునీటి ఆర్ఓ ప్లాంట్లు, టాయిలెట్లు ఉండాలని, వాటికి నీటిసరఫరా సౌకర్యం ఉండాలన్నారు. జిల్లాలో ప్రాథమిక, అంగన్వాడి, ఉన్నత పాఠశాలలో ఆర్వోప్లాంట్లు ఏలా పని చేస్తున్నాయని క్షేత్రస్థాయిలో పరిశీలించి, మంచినీటి పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. అలాగే భవనాలకు మౌలిక సదుపాయాలు పరిశీలించి రిపేర్లు ఉంటే పూర్తి చెయ్యాలని, శిథిలావస్థకు చేరిన భవనాలు ఉంటే ముందుగానే గుర్తించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. బాలికలు వసతి గృహాలు వద్ద భద్రత కొరకు దాతలను సంప్రదించి సీసీ కెమెరాలు ఏర్పాట్లు చెయ్యాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్‌డబి శాఖ యస్ఇ కె. విజయరత్నం, నీటిపారుదల శాఖ యస్ఇ సి. హెచ్. దేవప్రకాష్, గృహనిర్మాణ పిడి జి. సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్ష అభియాన్ అధికారి పంకజ్ కుమార్, ఐసిడిఎస్ పిడి పి.శారద, సాంఘిక సంక్షేమ శాఖ డిడి వై.విశ్వమోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు, డిఇలు, తదితరులు పాల్గొన్నారు.

# 16 గ్రామాల్లో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

**ప్రజాభూమి ప్రతినిధి – పాలకొల్లు**

నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పరిపాలన పురస్కరించుకొని మండల బీజేపీ అధ్యక్షులు చింతపల్లి రమేష్ శెట్టి అధ్యక్షతన జరిగిన సైకిల్ ర్యాలీ జరిగింది.ప్రతి గ్రామంలో మొక్కలు నాటుతూ కార్యకర్తలు 16 గ్రామాలు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పోడూరు మండలం ఇన్ ఛార్జ్ జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ 12 సంవత్సరాల సుపరిపాలనలో కేంద్రప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ పథకాలను వివరించారు. సుమారు 41 కిలోమీటర్ల సాగినా ర్యాలీలో గ్రామ గ్రామాన మొక్కలు నాటడం జరిగింది.మహిళలు విశేష స్పందన తెలియ చేయడం జరిగింది.మోదీ కి జై కొడుతూ,జై శ్రీరామ్ నినాదాలు చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు రమేష్ కూటమి నాయకులకు మరియు మొక్కలు కి సహకారం అందించిన జక్కంపూడి కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ



కార్యక్రమంలో కొల్లి కొండప్రసాద్,ఆకుమర్తి పెద్దిరాజు, మేడపాటి ప్రసాద్ రెడ్డి,నరేష్ కుమార్,ఉపాధ్యక్షులు నరేష్ కుమార్, కౌరు నాగబాబు, కనుమూరిగోపాలకృష్ణంరాజు, కడలి లక్ష్మీనారాయణ,వేంద్ర సురేష్, అనుసూరి వెంకట శెట్టి,దొమ్మేటిరామాంజనేయులు ,గణేష్ వల్లూరు ప్రసాద్,అనుసూరి వీరం చిట్టి, కొండేటి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## విద్యనందించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చు




**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

విద్యను అందించడం, బాల కార్మికులను గుర్తించి వారికి అన్ని వసతులు కల్పించి నాణ్యతతో కూడిన ఉచిత విద్యను అందించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ వచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యన్.శ్రీలక్ష్మి అన్నారు. బాలకార్మిక వ్యవస్థ వల్ల కలిగే నష్టాలను గురించి ప్రజలతో పాటు పరిశ్రమలు, సంస్థల యాజమాన్యాలను చైతన్య పరచడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి యన్.శ్రీలక్ష్మి అధ్యక్షతన, డిప్యూటీ కమిషనరు ఆఫ్ లేబర – క్రాఫ్ స్వచ్ఛందసంస్థ సంయుక్తశీగా ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో అధికారులతో పాటు ప్రజలు, పౌరులు సహకరించాలని సూచించారు. డిప్యూటీ కమిషనరు ఆఫ్ లేబరు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ బాల కార్మిక వ్యవస్థకు నిర్మూలించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో పాటు వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ టాస్కోర్సుల్ను ఏర్పాటు చేసి అనుక్షణం జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ నిర్వహించి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి కృషి చేస్తున్నామని తెలియజేశారు.

## బాధితులకు న్యాయం.. నేరస్తులకు శిక్షే లక్ష్యం : ఏలూరు జిల్లా ఎస్పీ



**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

ఏలూరులో నిర్వహించిన బాధితులతో ప్రత్యేక ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమాజంలో బలహీన వర్గాలకు అండగా నిలిచి వారికి న్యాయం చేయడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. బాధితులకు న్యాయం అందించడంలో, నేరస్తులకు శిక్షలు పడేలా చేయడంలో కోర్టు మానిటరింగ్ సెల్ ( సిఎంసి ) కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఏలూరు జిల్లాలో ఏర్పాటు చేసిన కోర్టు మానిటరింగ్ సెల్ ద్వారా ఇప్పటివరకు 62 కేసుల్లో 74 మంది నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన పర్యవేక్షణ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, ప్రభుత్వ న్యాయవాదులు, అదనపు పీపీలు, వివిధ కేసుల్లో న్యాయం పొందిన బాధితులు పాల్గొన్నారు. బాధితులకు న్యాయం అందించడంలో పోలీసు–ప్రాసిక్యూషన్ సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా పోలీసు సేవలను వినియోగించుకోవాలని, బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

## కూటమి ప్రభుత్వంపై విమర్శలా? వైకాపాకు ఆ అర్హతే లేదు

- 'వెన్నుపోటు' నిరసనలపై మచిలీపట్నం టీడీపీ నేతల నిప్పులు
- రాజకీయ ఉనికి కోసమే వైకాపా నాటకాలు: గొర్రెపాటి గోపిచంద్, గోపు సత్యనారాయణ
- రెండేళ్లలోనే రికార్డు స్థాయి అభివృద్ధి




**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రా న్ని సర్వనాశనం చేసిన వైకాపా నేతలకు, నేడు పారదర్శకంగా పాలిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమ ర్శించే నైతిక అర్హత లేదని మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. వైకాపా తలపెట్టిన వెన్నుపోటు నిరసన కార్యక్రమాలను వారు తీవ్రంగా ఖండించారు. గురువారం స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపిచంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు మోటమర్రి బాబాప్రసాద్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచె నాని తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, వైకాపా హయాంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి, అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం దూసుకుపోతోందని స్పష్టం చేశారు. కేవలం తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే వైకాపా నేతలు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన వైకాపాకు నిరసనలు తెలిపే హక్కు కూడా లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో అమలు చేస్తోంది. వైకాపా సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించి మరీ సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్తున్నాం. గడిచిన రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని నేతలు గుర్తుచేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ నగర కమిటీ అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామి, క్లస్టర్ ఇన్ ఛార్జ్ లు పల్లపాటి సుబ్రహ్మణ్యం, పిప్పళ్ల కాంతారావు, ఇలియాస్ పాషా, పుప్పాల ప్రసాద్, వక్కపట్ల శ్రీను మరియు పార్టీ ముఖ్య నాయకులు లంకే హరి తదితరులు పాల్గొన్నారు.

# కురుమద్దలిలో స్వచ్ఛ తనిఖీ

- గ్రామ పంచాయతీలో ఘన వ్యర్థాల నిర్వహణను పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి ఎం. ధనలక్ష్మి
- ఇంటింటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడిన డీపీఓ.. ఐవీఆర్ఎస్ సర్వేపై ఫీడ్‌బ్యాక్ సేకరణ



**ప్రజాభూమి బ్యూరో – కృష్ణాజిల్లా**

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని కృష్ణా జిల్లా పంచాయతీ అధికారి ఎం. ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పామర్రు మండలంలోని కురుమద్దలి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో అమలవుతున్న పారిశుద్ధ్య మరియు ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (రాభోజ) షెడ్‌ను డీపీఓ సందర్శించారు. ఇంటింటి నుండి సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేర్వేరుగా విభజిస్తున్న విధానాన్ని ఆమె అడిగి తెలుసుకున్నారు. తడి వ్యర్థాల ద్వారా తయారవుతున్న వెర్మి కంపోస్ట్ (సేంద్రియ ఎరువు) నాణ్యతను, దాని నిల్వ విధానాన్ని పరిశీలించిన ఆమె, ఎరువుల వినియోగంపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజల ముంగిటకే జిల్లా అధికారి.. లైవ్' ఫీడ్‌బ్యాక్

కురుమద్దలి గ్రామంలో కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా డీపీఓ ధనలక్ష్మి గారు నేరుగా వీధుల్లో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు నిర్వహిస్తున్న IVRS సర్వే తీరును స్వయంగా పరిశీలించారు. ప్రజలను అడిగిన ప్రశ్నలు పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ ఇంటికి వస్తున్నారా? చెత్త సేకరణ సేవలపై మీకు సంతృప్తి ఉందా? మీరు తడి, పొడి చెత్తను విడివిడిగా ఇస్తున్నారా? అంటూ గ్రామస్తులను అడిగి ప్రత్యక్షంగా ఫీడ్‌బ్యాక్ సేకరించారు. అధికారులకు డీపీఓ ఆదేశాలు : రైతులకు మేలు: వెర్మి కంపోస్ట్ ఉత్పత్తిని మరింత పెంచి, స్థానిక రైతులకు తక్కువ ధరకే అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలి. శాస్త్రీయ నిర్వహణ: ప్రతి గ్రామ పంచాయతీ స్వచ్ఛతకు, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు మరియు పర్యావరణ పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజల బాధ్యత: ప్రతి కుటుంబం తడి, పొడి వ్యర్థాలను విడివిడిగా ఉంచి మాత్రమే పారిశుద్ధ్య కార్మికులకు అందించేలా అవగాహన పెంచాలి. స్వచ్ఛ గ్రామాల లక్ష్య సాధనలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, పారిశుద్ధ్య సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాభూమి



## జులై 3న 'హలో రైతన్న.. ఛలో ఏలూరు' కార్యక్రమం

–రైతు సంఘం రాష్ట్ర మహాసభల ప్రచార క్లాత్ బ్యానర్ల ఆవిష్కరణ




ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభల సందర్భంగా జులై 3న నిర్వహించనున్న 'హలో రైతన్న.. ఛలో ఏలూరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరులోని అన్నే భవన్‌లో రాష్ట్ర మహాసభల ప్రచారం కోసం రూపొందించిన క్లాత్ బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 3, 4, 5 తేదీలలో ఏలూరులో జరిగే రాష్ట్ర 23వ మహాసభలకు రైతాంగం పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. జులై 3న నిర్వహించే రైతు––ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం అన్ని పంటల రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర మహాసభల్లో రైతాంగ సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించే దిశగా ఉద్యమాలను బలోపేతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, సీఐటీయూ నాయకులు పి. రవికుమార్, ఎం. ఇస్సాక్ పాల్గొన్నారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు
## ఏలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ



ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ . జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,ఏలూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) ఆధ్వర్యంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం గురువారం ఏలూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు నగర పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వద్ద ఉన్న డా . బి . ఆర్ . అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్ర, ఏలూరు నియోజకవర్గ అబ్జర్వర్ బీవీఆర్ చౌదరి హాజరై ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎన్ . చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని, రాజధాని అంశంలో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయడమే కాకుండా,సొంత పార్టీ కార్యకర్తలను సైతం నిరాశపరుస్తున్నారని ఆరోపిస్తూ ప్రజలకు వాస్తవాలను తెలియజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దద్దరిల్లిన దెందులూరు..
## వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భారీ నిరసన ర్యాలీ



ప్రజా భూమి ప్రతినిధి–దెందులూరు

నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం భారీగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నాయకత్వంలో కొండలరావుపాలెం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ గోపన్నపాలెం, సోమవారప్పాడు గ్రామాల మీదుగా దెందులూరుకు చేరుకుంది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నినాదాలతో ప్రాంతాన్ని మారుమోగించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ, గత రెండేళ్లుగా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, రైతులు, మహిళలు, యువత సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ భవిష్యత్తులో కూడా ఉద్యమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరావు, మండల స్థాయి నాయకులు, వివిధ కమిటీల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రుద్రం కోటలో అభయాంజనేయ స్వామి 11వ వార్షికోత్సవ వేడుకలు.

ప్రజాభూమి ప్రతినిధి–వేలేరుపాడు



వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామంలో కొలువుతీరిన అభయాంజనేయ స్వామి దేవాలయంలో 11వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తీర్థాల భాస్కర శాస్త్రి శాస్త్రోయుక్తంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం పురస్కరించుకొని తెల్లవారుజామునే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, తమలపాకులు పూజలు, సింధూరంతో అభిషేకం వంటి కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఉత్సవ మూర్తికి పలు రకాల ప్రత్యేక పూజలు భక్తజన సందోహం మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో గ్రామస్తులంతా విరివిగా పాల్గొని పునీతులయ్యారు. అనంతరం వాసిరెడ్డి జగన్, గుద్దేటి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో యావన్మంది భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుంది

### జిల్లా కలెక్టర్ కె వైట్రీ సెల్వి.

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా



రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యపై ప్రజలకు తెలియజేసి ప్రవేశాలు మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా స్థానిక 23వ డివిజన్ లోని నగరపాలక సంస్థ ప్రైమరీ స్కూల్ ను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల నుండి నగరపాలక సంస్థ ప్రైమరీ స్కూల్ లో ప్రవేశం పొందిన 8 మంది విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించి, పుస్తకాలు, విద్యా కిట్లను కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంచేందుకు ఖాళీగా ఉపాధ్యాయుల పోస్టులను ఇటీవల డీఎస్సీ ద్వారా భర్తీ చేశారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందించడంతోపాటు, పాఠ్య, నోట్ పుస్తకాలూ, బ్యాగ్ , షూ, యూనిఫామ్ లు ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్నారని, మధ్యాహ్న భోజన పథకం ద్వారా సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు ప్రవేశాలు జరగడం మంచి శుభపరిణామమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రజలకు ముఖ్యంగా పేద కుటుంబాల వారికి తెలియజేసి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు మరింత పెరిగేలా విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలకు ఎటువంటి కొరతా లేకుండా చూడాలన్నారు. రక్షిత త్రాగునీరు ఉండేలా చూడాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రోత్సహించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి విద్యాశాఖాధికారులు ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ శారద, ఏలూరు తహసీల్దార్ గాయత్రీదేవి, పురపాలక శాఖ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సౌకర్యాలను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు.

### గోవింద నామస్మరణలతో మారుమ్రోగిన నూజివీడు పురవీధులు



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

తిరుమల తిరుపతి ఏడుకొండల సామి సన్నిధిలో భక్తుల అన్న ప్రసాద కేంద్రమైన వెంగమాంబ సత్రంకు ఏలూరు జిల్లా నూజివీడు నుండి కూరగాయలు, మామిడి కాయలు, పండ్లను రైతులు అందించారు. నూజివీడు పరిసర గ్రామాలు స్వామి వారి దయతో సుభిక్షంగా ఉంటూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ప్రతి నెలా వాడపల్లి, ద్వారక తిరుమల, విజయవాడ ఇంద్రకీలాద్రి, తిరుపతి దేవస్థానాల అన్న సంతర్పణ కేంద్రాలకు 12టన్నుల కూరగాయలను అందించారు.

## ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు




రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి అధ్యక్షతన, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ మరియు క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 12న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలలకు నాణ్యమైన ఉచిత విద్య అందించడం, బాల కార్మికులను గుర్తించి వారికి అవసరమైన వసతులు కల్పించడం ద్వారా ఈ వ్యవస్థను నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల పిల్లల బాల్యం, సామర్థ్యం, గౌరవం దెబ్బతింటాయని, వారి శారీరక, మానసిక వికాసానికి తీవ్ర హాని కలుగుతుందని అన్నారు. ప్రజలతో పాటు పరిశ్రమలు, సంస్థల యాజమాన్యాలను కూడా చైతన్యపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో అధికారులు, ప్రజలు, పౌరులు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో పాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో సి.హెచ్. సూర్యచక్రవేణి, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ పి. వెంకటేశ్వరరావు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ ఎస్. నాగేశ్వరరావు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగేశ్వరరావు, సీడీపీవో తులసి, అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ శ్రీవల్లి పాల్గొన్నారు.

## గొడ్డలి పార్టీతో జాగ్రత్త... ఆస్తి లాగేసుకుంటారు

### మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మండలం దేవరగుంట గ్రామములో రైతుల మీ భూమి–మీ హక్కు కార్యక్రమంలో భాగంగా దేవరగుంట గ్రామంలో 593, మంది రైతులు, భూయజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు. 90 శాతం పాసుపుస్తకాలు పంపిణీ చెయ్యడం జరిగిందని, మిగిలినవి త్వరితగతిన పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్ధరాత్రి అయిన మొత్తం పాసు పుస్తకాలు పంపిణీ చేసి వెళ్లాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రైతులు భూహక్కులు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని, అందుకు అనుగుణంగా సర్వేపూర్తి అయిన ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెల ఒక గ్రామానికి వెళ్ళి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నారని, అదేవిధంగా రాష్ట్ర మంత్రులు కూడా పంపిణీ చెయ్యాలని ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రాష్ట్రంలో, నియోజవర్గం, గ్రామాల్లో వైసీపీ పార్టీవారు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు నమ్మరని, మనమంతా తిప్పికొట్టాలని అన్నారు. గత పాలకులు చిచ్చుపెట్టి భూవివాదాలు సృష్టించి, రికార్డులు తారుమారు చేశారన్నారు. ల్యాండు టైటిలింగు యాక్టు పేరిట ఓనల్ల చట్టం తెచ్చి భూమి కాజేసేందుకు గత పాలకులు ప్రయత్నాలు చేశారని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూమి రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ల్యాండు టైటిలింగు యాక్టును తక్షణం రద్దు చేసి భూమి యాజమాన్య హక్కుల్ని రక్షించామని అన్నారు. భూమి మీదైతే ఫోటోలు వారివి ముద్రించు కుని, పొలం సరిహద్దు రాళ్లపై



కూడా బొమ్మలు ముద్రించు కున్నారని అన్నారు. రీ సర్వే చేయటంతో పాటు రైతుల్ని భాగస్వాములను చేసి వివరాలను తనిఖీ చేసి, ఈకేవైసీ చేశాక పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. తప్పులు లేకుండా పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి నెలా వచ్చి నేరుగా భూయజమానుల్ని, రైతులను కలిసి ఈ పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ చేసిన దుర్మార్గాన్ని పరిష్కరిస్తూ, భూ రికార్డులను ప్రక్షాళన చేసేందుకు 3 ఏళ్ల సమయం పట్టిందని అన్నారు. ఈ సందర్భంగా పట్టాదారు పాసు పుస్తకంలో గల క్యూఆర్ కోడ్ లను వివరిస్తూ వాటిని స్కాన్ చేసినట్లయితే పట్టాదారు వివరములు, భూమి వివరాలు విస్తీర్ణం, స్కెచ్ మరియు రూటు మ్యాప్, శాటిలైట్ ఇమేజి కూడా చూసుకొనవచ్చునని మంత్రి రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్– చైర్మన్ మరియు నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, తహశీల్దారు,మండల అభివృద్ధి అధికారి, వివిధ శాఖలు అధికారులు, గ్రామ సచివాలయం, రెవిన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు,అ కూటమి నాయకులు, మండల, గ్రామ నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## "తెలుగునాటక రంగం" సామాజిక మార్పుకు దోహదం

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

### "తెలుగునాటక రంగం" సామాజిక మార్పుకు దోహదం



"తెలుగునాటక రంగం" కేవలం వినోదం మాత్రమే కాదని, సామాజిక సమస్యలు, నైతిక విలువలు, మానవ సంబంధాల లోతులను స్పృశిస్తూ సామాజిక మార్పుకు ఎంతో కృషి చేసిందని ప్రముఖ నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావుఅన్నారు. రసధుని సాహితీ సంస్థ పాలకొల్లు వారు స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్ నందు ఏర్పాటు చేసిన సాహితీ కార్యక్రమం లో " తెలుగు నాటక రంగం – మానవీయ కోణం " అనే అంశం పై తాళాబత్తుల మాట్లాడుతూ... సంఘ సంస్కరణ, మూఢనమ్మకాలు, సామాజిక, ఆర్థిక సమానత్వం కొరకు అభ్యుదయ నాటకాలు వచ్చాయని "కన్యాశుల్కశీ "నాటకం పురుషుడు కన్యకు శుల్కశీ ఇచ్చి పెండ్లి చేసుకునే విధాన్నాన్ని," వరవిక్రయం " కన్య పురుషుడుకి శుల్కశీ ఇచ్చే విధానాన్ని, "చింతామణి" వ్యభిచారం వృత్తిని, "మధుసేవ " మద్యపానాన్ని వ్యతిరేకిస్తూ నాటకాలు వచ్చాయని,నేను కుటుంబ విలువలు, అనుబంధాలు, మానవీయ విలువలు ప్రధాన అంశం తో నాటికలు రచించి మన పాలకొల్లు నటీ నట సంక్షేమ సమాఖ్య పేరుతో ప్రదర్శిస్తున్నాని, నన్ను నటుడుగా, రచయితగా తీర్చిదిద్దిన పాలకొల్లు నాటకరంగానికి, ముఖ్యంగా మా గురువు కత్తుల రామ్మోహన రావు కి జీవితాంతం కృతజ్ఞతలు తో ఉంటానని సభికుల హర్షధ్వనుల మధ్య తెలియజేసారు. ఈ సాహితీ సభకు కొట్టి భాస్కరరావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకటరత్నం స్వాగతించారు. ఇటీవల దివంగతులైన రసధుని సలహా మండలి సభ్యులు కీ.శే.మాడభూషి కృష్ణప్రసాద్గకి ఈసాహితీ సభ సంతాపం తెలియజేసింది. తదనంతరం ముఖ్యఅతిధి హరివిల్లు అధ్యక్షులు వంగా నరసింహ రావు, ఆంధ్రప్రదేశ్ నాటకపరిషత్ ల ప్రధాన కార్యదర్శి జవ్వాది దాశరదీ శ్రీనివాస్, వీరవాసరం నాటక కళా పరిషత్ అధ్యక్షులు గుండా రామకృష్ణ, పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి డా. పేరిచర్ల సత్య ప్రతాప్ రాజు, సీనియర్స్ సిటిజెన్స్ ప్రధాన కార్యదర్శి జి ఎస్ ఎన్ మూర్తి, రసధుని కార్యదర్శి మామిడి శెట్టి శ్రీనివాస్, చల్లా అన్నపూర్ణేశ్వరరావు లు తెలుగునాటకరంగం లో పాలకొల్లు నాటకరంగం చేస్తున్న కృషి ని కొనియాడారు. ముఖ్య వక్తను రసధుని కార్య వర్గం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో... కలిదిండి వెంకట పతి వర్మ, గంటా ముత్యాల రావు నాయుడు, చేగొండి రంగారావు, కాను కొలను శ్రీనివాస్, భట్టిప్రోలు సత్యనారాయణ, అడ్డాల వాసుదేవ రావు, రాయి సూరిబాబు, ర్యాలీ విష్ణుమూర్తి, కోలాటి పెద్దిరాజు, వామనమూర్తి, వడ్లమాని హరికృష్ణ, ముక్కు బాబు, గంధం కుమారస్వామి రాజా, కొల్లి నరసింహ మూర్తి, యర్రమిల్లి నరసింహారావు,గెద్దాడ పనీంద్రుడు, అత్యం ఆదిశేషారావు,జె రామలక్ష్మణ రావు, తుమ్మల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లు లో వెన్నుపోటుకు రెండేళ్లు ' పేరుతో వైసీపీ శ్రేణులు నిరసన, బైక్ ర్యాలీ

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

ప్రజలు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి, చంద్రబాబు ప్రజలు ప్రజలు ఇచ్చిన హామీలు కి వెన్నుపోటు పొడిచి రెండేళ్లు శుక్రవారం పాలకొల్లులో వైసీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటుకు రెండేళ్లు ' పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పూలపల్లి అంబేద్కర్ సెంటర్ నుండి యడ్ల బజారు వరకు వైసీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అంతకు ముందు పూలపల్లి నుండి ఎడ్ల బజారు వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భారీ బైక్ ర్యాలీ నిర్వహించినారు.



## ఇంటి నిర్మాణానికి సిమెంట్ధర్మారావు ఫౌండేషన్ బస్తాలు సాయం




ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి సిమెంట్ బస్తాలు సాయం. పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ఇంటిని నిర్మించుకునేందుకు చంద్రమౌళి వెంకటరమణ కు 20 సిమెంట్ బస్తాలను అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ , మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి ఇంటి నిర్మాణానికి సాయం అందించాలని కోరగా స్పందించి ఫౌండేషన్ సభ్యుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శాగా సత్యనారాయణ,అందేకోటి వీరభద్రరావు, కలిదిండిరామచంద్రరాజు, రాపాక వెంకటేశ్వరరావు, కొమ్మని కన్నయ్య ధర్మరావు ఫౌండేషన్ సభ్యులు, రావూరి వెంకట అప్పారావు మేడిశెట్టి కేశవరావు, పీతల శ్రీను తదితరు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
కాకినాడ, తూర్పుగోదావరి 5
శనివారం 13, జూన్ 2026

# ప్రజా పాలనతో స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రం ముందుకు

- సంక్షేమం - అభివృద్ధి సమన్వయంతో ప్రజల విశ్వాసం గెలుచుకుంటున్న ప్రభుత్వం
- కొత్తపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో వేగవంతమైన అభివృద్ధి



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. సంక్షేమం ప్రజలకు భరోసాను కల్పిస్తే, అభివృద్ధి భావితరాలకు బలమైన పునాదులు వేస్తుందని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే విధంగా పాలన కొనసాగుతోందని వారు తెలిపారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం ఎదుర్కొన్న పరిస్థితులతో పోల్చితే నేడు ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తూ కొత్త దిశగా అడుగులు వేస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుతో సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చిన ప్రభుత్వం, "తల్లికి వందనం" పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించిందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా 71 కోట్ల ప్రయాణాలకు అవకాశం కల్పించిందన్నారు. "అన్నదాత సుఖీభవ" పథకం ద్వారా రైతులకు రూ.8,985 కోట్ల సహాయం అందించడంతో పాటు, ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ.65 వేల కోట్లకు పైగా పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. 5.5 లక్షల ఇళ్ల పంపిణీతో పాటు మరో ఐదు లక్షల గృహాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అమరావతిని శాశ్వత రాజధానిగా అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం చారిత్రాత్మక అడుగులు వేస్తోందని, రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని రాష్ట్రంపై కేంద్రీకరించగలిగిందన్నారు. విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, రాయలసీమలో సెమీకండక్టర్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20,060 కిలోమీటర్ల రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, వేల కోట్ల రూపాయల వ్యయంతో కొత్త రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పోలవరం, వెలిగొండ, నేరడి, చింతలపూడి వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం వేగం తీసుకొచ్చిందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,035 ప్రభుత్వ సేవలను ప్రజల అరచేతిలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. గంజాయి, డ్రగ్స్ మాఫియాపై ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా కఠిన చర్యలు చేపడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, విద్యుత్, నీటి నిర్వహణ, గ్రామీణాభివృద్ధి, పారిశ్రామికీకరణ తదితర రంగాల్లో సంస్కరణలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపిస్తున్నట్లు నాయకులు తెలిపారు. అదేవిధంగా కొత్తపేట నియోజకవర్గంలో శాసనసభ్యుడు బండారు సత్యానందరావు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు, క్లస్టర్ కో-ఇన్‌చార్జి బూసి భాస్కరరావు, అద్దంకి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

- 'ఫెర్టిలైజర్ ఫ్రేమ్‌వర్క్ యాప్' పనితీరు పరిశీలించి, రైతులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్
- జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ

ప్రత్తిపాడు మండలంలోని రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం గౌరవ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువులు పంపిణీకి సంబంధించి కాకినాడ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయబడిన నూతన విధానం "ఫెర్టిలై జర్ ఫ్రేమ్‌వర్క్ యాప్" పనితీరును జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా స్వయంగా పరిశీలించారు. ఈ సరికొత్త విధానం ద్వారా రైతులు తమ మొబైల్ యాప్‌లోనే అవసరమైన ఎరువులను బుక్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆ వెంటనే యాప్‌లో ఒక క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రైతు ఆ క్యూఆర్ కోడ్‌ను తీసుకుని తాను ఎంపిక చేసుకున్న సొసైటీ, రైతు సేవా కేంద్రం లేదా డీలర్ వద్దకు వెళ్తే, అక్కడ ఉండే డీబీటీ, ఈ-పోస్ మిషన్‌లో ఆ కోడ్‌ను స్కాన్ చేసి ఎరువులు పంపిణీ చేస్తారన్నారు. ఈ మొత్తం డిజిటల్ ప్రక్రియను కలెక్టర్ గారు నిశితంగా పరిశీలించి, అధికారులను వివరించారు. అనంతరం మండల వ్యవసాయ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్)ను సమీక్షించి, స్థానిక రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేయబోయే వంగడాల (విత్తనాల) వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, రైతులకు యూరియా కార్డుల పంపిణీ ప్రక్రియ వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా రైతులకు పీఎండీఎస్ కిట్లను అందజేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపురం ఆర్‌డీఓ పి.కృష్ణమూర్తి, ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్య ప్రభ, డిప్యూటీ డైరెక్టర్ ఏలీయాజరు, జగ్గంపేట ఏడీఏ శ్రీనివాసు ఎంఏఓ జె.అమృత తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం

### వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు ప్రజా దర్బార్



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే తన లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని వాడపాలెం గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గం లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే కు అందజేశారు. ప్రతి సమస్యను ఓర్పుగా విన్న ఎమ్మెల్యే, వాటి స్వరూపాన్ని తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం ప్రజా ప్రతినిధిగా తన బాధ్యత అని ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికా రులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న నిత్య అన్నప్రసాద పథకానికి రూ.50,116 అందజేత

### దాతలకు అర్చకుల వేదాశీర్వచనం, ఘన సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

కోనసీమ తిరుమలగా సుప్రసిద్ధమైన వాడపల్లి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న నిత్య అన్నప్రసాద పథకానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోం ది. ఇందులో భాగంగా రావులపాలెం మండలం రావులపాలెం కి చెందిన మల్లిడి శ్రీనివాస్ రెడ్డి లోక పుష్పావతి దంపతులు, కుటుంబ సభ్యులు అన్నదాన వితరణ కోసం రూ.50,116 నగదును విరాళంగా సమర్పించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించిన అనంతరం దాతలు ఈ నిధులను అధికార యంత్రాంగానికి అందజేశారు. వారి ఉదార స్వభావాన్ని ఆలయ వర్గాలు ప్రశంసించాయి. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వ చనం పలికి, దాతలను స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు. భక్తుల ఆర్థిక సహకా రంతోనే ఈ అన్నదాన సేవలు నిరంతరాయంగా, నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయని, భవిష్యత్తులోనూ మరింత మంది దాతలు ముందుకొచ్చి ఈ పవిత్ర కార్యంలో భాగస్వాములు కావాలని దేవస్థాన పాలక మండలి సభ్యులు పిలుపునిచ్చారు.

## టీడీపీ రెండేళ్ల సంబరాల ప్రకటనల వెనుక గిరిజన యువత కన్నీళ్లు దాగివున్నాయి



ప్రజాభూమి ప్రతినిధి - వి.ఆర్.పురం.

తెలుగుదేశం ప్రభుత్వ రెండేళ్ల సంబరాల ప్రకటనల వెనుక గిరిజన యువత కన్నీళ్లు దాగి ఉన్నాయని, ఆదివాసి గిరిజన సంఘం వి. ఆర్. పురం మండల అధ్యక్ష, కార్యదర్శులు, కారం సుందరయ్య, పూనెం. ప్రదీప్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం గిరిజన రిజర్వేషన్లను పునరుద్ధరించే "జీవో నెంబర్ 3" పై ప్రభుత్వం వహిస్తున్న మౌనాన్ని అస్తిత్వ పోరాటంగా మారుస్తామని వారు హెచ్చ రించారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 పోస్టుల భర్తీ అంటూ పేజీల కొద్దీ ఇస్తున్న అడ్వర్టైజ్మెంట్లు గిరిజన యువత పొట్టకొట్టే విగా మారాయే తప్ప, వారి జీవితాల్లో వెలుగులు నింపేవిగా లేవని వారన్నారు. ?గతంలో ఉన్న జీవో నెం. 3 ప్రకారం ఏజెన్సీ (షెడ్యూల్డ్) ప్రాంతాల్లోని ఉపాధ్యాయ పోస్టులు 100% స్థానిక గిరిజనులకే దక్కేవి. సుప్రీంకోర్టు తీర్పు నెపంతో దీన్ని రద్దు చేయడం వల్ల, ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ (15,941 పోస్టులు) లో గిరిజన యువత ఎదుర్కొం టున్న నష్టం ?100% నుండి 6% కి వంద శాతం రిజర్వే షన్ స్థానంలో సాధారణ ఎస్టీ కోటా కేవలం 6% మాత్రమే అమలువుతోంది. అంటే, ఏజెన్సీ స్కూళ్లలో గతంలో ఆదివాసు లకు దక్కాల్సిన 94% పోస్టులు ఇప్పుడు ఓపెన్ కేటగిరీ కింద మైదాన ప్రాంతాల అభ్యర్థుల పరమవుతున్నాయనీ అన్నారు. ఉదాహరణకు ఏజెన్సీ పరిధిలోని స్కూళ్లలో 1,000 పోస్టులు ఉన్నాయనుకుంటే... గతంలో జీవో నెం. 3 ద్వారా 1,000 కి 1,000 పోస్టులు గిరిజనులకే వచ్చేవి. నేడు సాధారణ రిజర్వేషన్ ప్రకారం కేవలం 60 పోస్టులు మాత్రమే గిరిజన యువతకు దక్కుతాయి. మిగిలిన 940 పోస్టులను ఆదివాసీలు శాశ్వతంగా కోల్పోతున్నారనీ పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, పాలకులు స్పందించి జీవో నెం. 3 పై చట్టబద్ధమైన గ్యారెంటీ ఇచ్చేంత వరకు యావత్ గిరిజన లోకం, గిరిజన నిరుద్యోగ యువత ఏకతాటిపైకి రావాలని ఆదివాసి గిరిజన సంఘం వి. ఆర్. పురం మండల కమిటీ పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు సోయం చిన్న బాబు పొడియం శ్రీరామమూర్తి కుంజా కన్నయ్య సోడి మల్లయ్య ముల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ యోగా దినోత్సవం విజయవంతానికి గ్రామస్థాయిలో అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

మన ప్రాచీన భారతీయ సంపదలో యోగ ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉందని, ఆరోగ్యకరమైన జీవనానికి, మానసిక ఉల్లాసానికి, మనశ్శాంతికి యోగ దివ్య ఔషధంగా పనిచేస్తుందని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జూన్ 21న అమరావతిలో నిర్వహించే మెగా యోగా కార్యక్రమానికి పంపనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా శుక్రవారం రావులపాడు గ్రామంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోజూ కనీసం అరగంట సమయాన్ని యోగకు కేటాయించి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు. యోగ ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, యోగా శిక్షకులు, గ్రామస్థులు పాల్గొని యోగా సాధన చేశారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు - కూటమి ప్రభుత్వ మోసాలపై నిరసన

- డీఎస్సీ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయి
- రైతుకు పెట్టుబడి సాయం, 50 ఏళ్లకే పెన్షన్ హామీలపై నిలదీత
- మద్యం, నిత్యావసర ధరలు, ఇసుక సమస్యలతో ప్రజలపై భారం



ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాలను నిరసిస్తూ "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, కొత్తపేట నియోజకవర్గ పరిశీల కులు పాటి శివకుమార్ పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు రావులపాలెం డిగ్రీ కళాశాల గ్రౌండ్ నుండి రావులపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. కొత్తపేట నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధు లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, చిర్ల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని నాయ కులు విమర్శించారు. మెగా డీఎస్సీ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, రైతుకు పెట్టుబడి సాయం, 50 ఏళ్లకే పెన్షన్ వంటి కీలక హామీలు నేటికీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మద్యం విధానం, గ్యాస్, వంటనూనె, పెట్రోల్, డీజిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇసుక, మట్టి సమస్యలతో నిర్మాణ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికే "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

## కూటమి వైఫల్యాలపై వైసీపీ ధ్వజం!

- ప్రత్తిపాడులో భారీ నిరసన ప్రదర్శన
- హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం ముద్రగడ గిరి



ప్రజా భూమి - ప్రత్తిపాడు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసనలతో హోరెత్తిం చాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవ ర్గంలో వైసిపి శ్రేణులు భారీ నిరసనకార్యక్రమాన్ని చేపట్టాయి. "చంద్రబా బు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు" అనే నినాదంతో స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరి నేతృత్వంలో కార్యకర్తలు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్దకు చేరుకుని, దివంగత మాజీ ముఖ్యమంత్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా "చెట్టుమీద కొంగ.. చంద్రబాబు దొంగ" అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలు మార్మోగాయి.

**హామీల అమలులో పూర్తిగా విఫలం: ముద్రగడ గిరి :** నిరసన అనంతరం వైయస్సార్సీపి ఇంచార్జ్ ముద్రగడ గిరి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ సహా ఏ ఒక్క హామీని కూడా కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేకపోయిందని ఆయన ఆరోపించారు.

**"గడిచిన రెండేళ్ల కాలంలో సంక్షేమ పథకాలను పూర్తిగా పక్కనబెట్టేశారు. ప్రజలపై భారాలు మోపుతూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది."**

**- ముద్రగడ గిరి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్**

రాష్ట్రంలో నానాటికీ పెరుగుతున్న ప్రజా సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైసీపీ శ్రేణులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మాదిగ సామాజిక భవనం స్థల వివాదంపై ఎమ్మెల్యే ను కలసిన మాదిగ సభ్యులు



ప్రజాభూమి ప్రతినిధి - తాళ్లపూడి

పైడిమెట్టలో మాదిగ సామాజిక భవన స్థలం ఆక్రమణ లపై కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బుధవారం తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మి లావణ్య విచారణ చేపట్టారు. ఇటు మాదిగ పెద్దలు అటు స్థలాన్ని ఆక్రమించాలని ప్రయత్నం చేస్తున్న వ్యక్తులతో మాట్లాడి నివేదికను కలెక్టర్ కి పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇదే విషయాన్నీ శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు కి పైడిమెట్ట గ్రామస్తులు వివరించారు. మాదిగ సామాజిక భవనం 2017 లో ఎం పి తోట సీతరామ లక్ష్మి నిధుల తో నిర్మించారని, పైడిమెట్ట మాదిగలకు ఉన్న ఏకైక సామాజిక భవనం, స్థలం ఇదేనని దీనిని అనుకుని పక్కన పొలం కొనుక్కున్న వ్యక్తి అక్రమంగా ఆ స్థలంలో భవనం నిర్మించి ఇప్పుడు దారి వంకతో మాదిగల స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నట్లు ఎం ఎల్ ఏ కి వివరించారు. దీనిపై అయన స్పందిస్తూ అధికారులకు సూచనలు చేశారు. ఈ క్రమంలో పైడిమెట్ట మాదిగ కులస్తులు ఎం ఎల్ ఎ కు కృతజ్ఞతలు తెలిపారు.

## తాళ్లపూడి మెయిన్ రోడ్డులో డ్రైనేజ్ సమస్య పరిష్కరించాలని వినతి



ప్రజాభూమి ప్రతినిధి - తాళ్లపూడి

తాళ్లపూడి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాజమండ్రి ఎంపీ పురందేశ్వరికి, జిల్లా బీజేపీ అధ్యక్షులు పిక్కి నరేంద్రకు శుక్రవారం నిర్వహించిన "జనతా వారి" కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తాళ్లపూడి మండల అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తాళ్లపూడి మెయిన్ రోడ్డులో డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం తో వర్షపు నీరు నిలిచి ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి కృష్ణ, సీనియర్ నాయకు రాలు ఇమ్మని అనసూయమ్మ, మహిళా మోర్చా అధ్యక్షురాలు మత్తుకూరి అరుణ, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిపూడి రాజేష్ పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడ నియోజకవర్గ స్థాయిలో "వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్" కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్

ప్రజాభూమి ప్రతినిధి - ప్రత్తిపాడు

రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తు న్నామని ఈ కార్యక్రమం కింద అందిన అర్జీల కు తక్షణమే స్పందించి వేగంగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమాన్ని శుక్రవారం ప్రత్తిపాడు నియోజ కవర్గ స్థాయిలో ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యా లయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్.. పెద్దాపు రం ఆర్డీవో పి.కృష్ణ మూర్తి, ప్రత్తిపాడు నియో జకవర్గ ప్రత్యక అధికారి ఏ.శ్రీనివాసరావు తదితరులతో కలిసి హాజరై, ప్రత్తిపాడు నియో జకవర్గం చుట్టుపక్కల ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను అర్జీలను స్వీకరించారు. పింఛ న్లు, ఇళ్ల స్థలాల మంజూరు, సధరం సర్టిఫి కెట్, భూ రికార్డులు ఆన్ లైన్ లో నమోదు, రీ సర్వే, పంట నష్టం, సీసీ రోడ్లు, డ్రైన్స్, మురు గు కాలువలు, పారిశుద్ధ్యం, స్మశాన వాటికల్లో షెడ్ ఏర్పాటు, విద్యుత్తు వంటి అంశాలపై మొత్తం 112 అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు సూచిస్తూ నిర్దిష్ట సమయంలోపు తగిన పరిష్కారాల అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వారం ప్రజల నుంచి అందిన అర్జీలకు వచ్చే శుక్రవారం నాటికి పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి లో ఉన్న సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారించ బడేలా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం




జిల్లాలో "ఒక నెల- ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమం నిర్వహిస్తున్నామ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి లో ప్రజా సమస్యలు పరిష్కరించునేందుకు దోహద పడుతుందన్నారు. గ్రామ ప్రజలు నేరుగా అధికారులను కలుసుకుని తమ సమ స్యలు పరిష్కరించుకునే ఇదో చక్కని వేధికని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి అందిన అర్జీలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరిం చాలని, గ్రామ స్థాయిలో సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన అర్జీలను పరిష్క రించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల్లో నమోదైన దరఖాస్తులను సంబంధిత అధికారు లు క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి స్థాయిని పెంచేలా తగిన పరిష్కార నివేదికలు ఇవ్వాలన్నారు. వచ్చేవారం జరిగే కార్యక్రమం నాటికి ఈ అర్జీల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్య ప్రభ, ఎంపీడీవవో కుమార్ బాబు, ఇతర మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 13 జూన్ 2026

# ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం శ్రీనివాసులు అకాల మృతి

## అంత్యక్రియల నిమిత్తం రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం జిల్లా పోలీస్ ఏ.ఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాసులు శుక్రవారం వేకువజామున అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్ర్భాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. శ్రీనివాసులు, పోలీస్ శాఖలో చేరారు. సుదీర్ఘ కాలంగా ఎనలేని సేవలు అందించారు. ఆరోగ్య పరిస్థితి గత కొంతకాలంగా శ్రీనివాసులు కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. అనారోగ్యం క్షీణించడంతో వీరిని అనంతపురంలోని సవేరా హాస్పిటల్‌లో చేర్పించడం జరిగింది. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వేకువ జామున ఆయన తుదిశ్వాస విడిచారు. శుక్రవారం మధ్యహ్నం స్థానిక హిందూ శ్మశాన వాటికలో అంత్య క్రియలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ తక్షణ ఆర్థిక సాయం హెడ్ కానిస్టేబుల్ ఎం. శ్రీనివాసులు అకాల మరణం పట్ల జిల్లా ఎస్పీ పి.జగదీష్ తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. మృతుని కుటుంబ పరిస్థితిని గమనించిన ఎస్పీ తక్షణమే స్పందించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 2,00,000/- ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేయించారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్పీ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కుటుంబ వివరాలు మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు హరీష్ సాయి (28) చిన్న కుమారుడు రోహిత్ సాయి (24) డోర్ నెం: 304, టి.కె.ఎ.ఆర్. అపార్ట్‌మెంట్, తిలక్ రోడ్, అనంతపురం. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించి, అకాల మరణం చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం. శ్రీనివాసులు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రార్థించింది. ఆర్ ఐ మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, గాండ్ల హరినాథ్, శివకుమార్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



# ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

### -మూడు కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థ

### -వారం రోజుల్లో అందుబాటులోకి...

### మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



ప్రజాభూమి, హిందూపురం టౌన్

శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. పోలీసు శాఖకు సహకారం అందించడంలో భాగంగా పట్టణంలోని మూడు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరో వారం రోజుల్లో సిగ్నల్ వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్, బి.ఎస్.టి పెట్రోల్ బంక్, రహమత్ పురం సర్కిల్ లలో ప్రస్తుతం సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన వెంటనే వాహనదారులు, పాదచారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు, వాహనదారులు పట్టణంలోని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని కమిషనర్ కోరారు.

# తిరుపతిలో “2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం” భహిరంగ సభ

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



తిరుపతిలో నిర్వహించిన “2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం” మహాసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎన్డీయే కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. “సుపరిపాలన - స్వర్ణాంధ్ర రెండేళ్ల విజయోత్సవ సభ”లో తెలుగుదేశం ఆధ్వర్యంలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంఘీభావం తెలుపుతూ, ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యానికి సంపూర్ణ మద్దతు ప్రకటించామన్నారు. ప్రజల నమ్మకమే బలం అభివృద్ధియే లక్ష్యం సంక్షేమమే సంకల్పం అని అన్నారు.

## రాజకీయ పార్టీల బీఎల్‌ఏలకు ప్రత్యేక శిక్షణ

ప్రజాభూమి, హిందూపురం టౌన్




హిందూపురం మండల పరిధిలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్‌ఏలు) శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బీఎల్‌ఏలు హాజరై ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన పొందారు. శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మహేష్ పాల్గొని ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర, బీఎల్‌ఏల విధులు, అభ్యంతరాలు దరఖాస్తుల పరిశీలన విధానం, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల మార్పులు, జాబితా పరిశుభ్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత, ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల అధికారులతో సమన్వయంగా పనిచేయాలని అధికారులు సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, విధానాలను ప్రతి బీఎల్‌ఏ క్షుణ్ణంగా అవగాహన చేసుకుని తమ పరిధిలోని ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఏలు, ఎన్నికల సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రక్తదానం, ప్రాణదానంతో సమానం, రక్తదాన శిబిరం ఏర్పాటు స్ఫూర్తిదాయకం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

రక్తదానం చేయడం ద్వారా ఒకప్రాణాన్ని కాపాడినవారమవుతారని రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఉదయం రాయదుర్గం నియోజకవర్గంలోని ఆవులదట్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లాకలెక్టర్ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసి మెగా బ్లడ్ క్యాంప్ ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా స్ఫూర్తిదాయకంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇంత పెద్ద ఎత్తున మానవతా దృక్పథంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ






రక్త దాతలు రక్తదానం చేసి సాటి మనిషి ప్రాణాలు కాపాడడంలో మించిన దానం మరొకటి లేదని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడంలో ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందక ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో శుక్రవారం స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ఎంతో స్ఫూర్తిదాయకం ఆదర్శనీయ మైందన్నారు. ముఖ్యంగా పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రమాద సమయాల్లో, గర్భిణీ స్త్రీల ప్రసవాలకు ఇతర ముఖ్య సమయాలలో రక్తదానం చేయడం వల్ల ఎలాంటి బలహీనత రాదని అంతేగాక శరీరంలో కొత్త రక్తం తయారై ఆరోగ్యం కూడా బాగుంటుందని ప్రతి ఒక్కరు భయాన్ని విడి విరివిగా రక్త దానం చేయడానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కోరారు. తాను కూడా కాలేజీలో విద్యార్థి దశలో ఉన్నప్పుడు అనేక సందర్భాల్లో రక్తదానం చేశానని జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు. జిల్లాలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న రోగులకు కూడా రక్తదానం లాంటిసేవలు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. సమాజ సేవలో భాగంగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన బృహత్తర కార్యక్రమం ఆపదలో ఉన్న వారికి ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రక్తదాతలు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ రెడ్ క్రాస్ సొసైటీ లేదా ప్రైవేట్ సంస్థలలో స్వచ్ఛందంగా రక్తదానం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా ఈ బీ దేవి, మెడికల్ ఆఫీసర్ డా. రాజేంద్రప్రసాద్, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పయ్యావుల ప్రవీణ్, అయూఫ్, తాలూకా అధ్యక్షుడు కమలాక్షుడు, తాలూకా జనరల్ సెక్రెటరీ గురు ప్రసాద్, ప్రచార కార్యదర్శి ఆవుల మనోహర్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కె.పి. కుమార్, యూనియన్ నాయకులు, జర్నలిస్టులు, ప్రజలు, రక్తదాతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

### - : విద్యాభివృద్ధికి తోడ్పడాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

### - : బెలుగుప్ప మండలం కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పెద్దఎత్తున చేర్పించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కాగా, బెలుగుప్ప మండలం కాలువపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు, ఎన్రోల్మెంట్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంతమంది విద్యార్థులు పాఠశాలలో చేరారు, ఆరో తరగతి, ఏడవ, తరగతి వారిగా ఎంతమంది విద్యార్థులు





ఉన్నారు, ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు ఎంతమంది వచ్చారు, తదితర వివరాలు పాఠశాల హెచ్ఎంని అడిగి తెలుసుకున్నారు. ఇందులోభాగంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ఈరోజు అన్ని పాఠశాలలు తెరుచుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను మరింతమందిని చేర్పించాలని, విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గుత్తి డివిజన్ ఎడ్యుకేషన్ అధికారి లక్ష్మన్న, ఎంఈఓలు గోవిందరాజులు, హరికృష్ణ, పాఠశాల హెడ్మాస్టర్ సుధామని, మండల డిప్యూటీ తహసీల్దార్, విద్యార్థులు, స్కూల్ కమిటీ చైర్మన్, సభ్యులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉరవకొండ ప్రజలను వెంటిలేటర్ పై ఉంచిన కూటమి ప్రభుత్వం!

### -ఉరవకొండకు పట్టిన గ్రహణం పయ్యావుల కేశవ్! లిఉరవకొండను పేకాట, బెల్ట్ షాపుల కేంద్రంగా మార్చేశారు!

### -ఆర్థిక మంత్రికాదు అప్పుల మంత్రి!

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా ఉరవకొండలో జరిగిన ప్రజా ప్రదర్శనలో మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి వైయస్సార్సీపి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా ఉరవకొండలో శుక్రవారం మాజీ శాసనసభ్యులు విశ్వేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో సూపర్ సిక్స్ తో పాటు 140 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. రెండు సంవత్సరములు గడిచిపోతున్నా నిరుద్యోగ భృతి, బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్, ప్రతి ఆడబిడ్డకు నెలకు ?1500, రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్, పంటకు గిట్టుబాటు ధర అమలు చెయ్యలేదని, వెంటనే అమలు చేయాలని, ప్లే కార్డులను చేత పట్టి, అబద్ధాల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగి పోవాలన్న నినాదాలతో ఉరవకొండ ప్రజలు దద్దరిల్లిందన్నారు. ప్రజలు, మహిళలు,





వైసీపీ శ్రేణులు ప్రజా కంటక, ప్రభుత్వం పోవాలని శాపనార్థాలు పెట్టారన్నారు. ఈ రెండేళ్ల కాలంలో ఉరవకొండ ప్రజల జీవితాలు చితికి పోయాయని, ఎన్నికలలో చెప్పిన వాగ్దానాలను అమలు చేయాలని ప్రశ్నిస్తే పోలీసులతో అణచి వేస్తున్నారని, పాలన పక్కనపెట్టి, సంపాదనే ఏకైక లక్ష్యంగా కూటమి నాయకులు పనిచేస్తున్నారని అన్నారు. పంచభూతాలను అమ్మేసినా ఆకలి తీరని పచ్చ గద్దలు చివరికి రెక్కల కష్టం చేసుకుంటున్న ఉపాధి కూలీల కడుపులను సైతం కొట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు ప్రజా ప్రతినిధులు గడప గడపకు వెళ్లి ఎవరికైనా అర్హులకు ప్రజా సంక్షేమం అందలేదా? అని అడిగిన సందర్భం దేశ చరిత్రలో ఎక్కడా లేదు అన్నారు. ఉచిత విద్య, వైద్యాన్ని ప్రజల ముంగిటికే చేర్చిందని, గత ప్రభుత్వం అప్పులు చేసి ప్రజల సంక్షేమం కోసం నేరుగా వారి ఖాతాలలో డబ్బులు వేస్తే, నేడు కూటమి చేస్తున్న అప్పులు పచ్చ చొక్కాల ఖాతాలలోకి వేసుకుంటున్నదన్నారు. ఖరీఫ్ మొదలై విత్తనం వేయడానికి పెట్టుబడి లేక బిక్క మొఖం వేసి, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, అప్పులు పుట్టక, చేసిన అప్పులు తీర్చలేక, పిల్లలను చదివించుకోలేక, పెళ్లిళ్లు చేయలేక ఆత్మహత్య చేసుకుంటున్న రైతులను గాలికి వదిలేసిన మానవత్వం లేని అతి కిరాతక ప్రభుత్వం అని అన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన వాగ్దానాన్నింటినీ నెరవేర్చే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల వైపున నిలబడి పోరాడుతుందని పిలుపునిచ్చారు. మార్కండేయ దేవాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన టవర్ క్లాక్ దగ్గర బహిరంగ సభతో ముగిసింది. ఈ కార్యక్రమంలో మండలాల నుంచి వైసీపీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున జెండాలు చేతబూని పాల్గొన్నారు. ఉరవకొండ నియోజకవర్గ వైసిపి అబ్జర్వర్ గోవర్ధన్ రెడ్డి, గ్రేటర్ రాయలసీమ అధికార ప్రతినిధి కేవీ రమణ, జిల్లా అధికార ప్రతినిధి సిపి వీరన్న, ఎంపీపీ నర్సింహులు, భీమిరెడ్డి, భరత్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, గోవిందు బసవరాజు, ఏసి ఎర్రిస్వామి, ఈడిగ ప్రసాద్, బెస్తరామన్న తదితరులు పాల్గొన్నారు.

# హామీలన్నీ గాలికొదిలేశారు... నమ్మకానికి వెన్నుపోటు

- చంద్రబాబు రెండేళ్ల పాలనపై తీవ్ర విమర్శలు
- హిందూపురంలో వైసీపీ భారీ నిరసన ర్యాలీలో ఫయాజ్ భాషా, దీపికా వేణు రెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూపురం పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన “వెన్నుపోటుకు రెండేళ్లు” కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీలో వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ రిలయన్స్ పెట్రోల్ బంక్, గురునాథ సర్కిల్, సద్భావన్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. ర్యాలీ సందర్భంగా పార్టీ శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు ఫయాజ్ భాష ముఖ్య అతిథిగా హాజరుకాగా, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఫయాజ్ భాష, దీపికా వేణురెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం రెండేళ్లలో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అబద్ధపు హామీలతో ప్రజల ఆశలను రెచ్చగొట్టి అధికారాన్ని దక్కించుకున్న ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.



రైతులకు అండగా ఉంటామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు రైతులను అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతుల ఆత్మవిశ్వాసం దెబ్బతింటోందన్నారు. యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను పూర్తిగా నిరాశపరిచిందన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలో స్పష్టమైన కార్యాచరణ లేకపోవడంతో లక్షలాది మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. డీఎస్సీ సహా నియామక ప్రక్రియల్లో కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. మహిళలకు ఆర్థిక భరోసా, స్వయం సమృద్ధి కల్పిస్తామని చెప్పిన హామీలు అమలు కాలేదని, పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలను కోతలకు గురిచేశారని విమర్శించారు. మొదటి ఏడాది అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి, రెండో ఏడాది అమలులో ఉన్న పథకాలకే పరిమితులు విధించారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన “సూపర్ సిక్స్” హామీల పరిస్థితి ఏమైందో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని




చెప్పిన హామీ ఎక్కడ అమలైందో ప్రభుత్వం వెల్లడించాలని ప్రశ్నించారు. కొత్త పెన్షన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికే మంజూరైన పథకాల వద్ద ఫొటోలు దిగుతూ ప్రచారం చేసుకోవడం తప్ప ప్రజలకు కొత్తగా ఒరిగిందేమీ లేదని విమర్శించారు. రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కంటే అరాచకాలు, రాజకీయ కక్షసాధింపులు పెరిగాయని ఆరోపించారు. ప్రజలు తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక అవసరాల కోసం ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటాలతో కాలం గడుపుతోందన్నారు. ఇది ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం కాదని, ప్రచారం కోసం పనిచేసే ప్రభుత్వం అని విమర్శించారు. ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసిన ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమయంలో తీర్పు చెబుతారని హెచ్చరించారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అధికారంలో చేసిన పనులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, గ్రామ గ్రామాన, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని నాయకులు స్పష్టం చేశారు. రైతులు, యువత, మహిళలు, కార్మికులు, పేదల తరపున నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణురెడ్డి, కట్ల భాష, రాము, రమేష్, ఎంపీపీ రత్నమ్మ, నాగమణి, నారాయణ స్వామి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మాజీ కౌన్సిలర్ షాజియా ఆసిఫ్ మింటూ, దాదాపీర్, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

## -పోలీసులకు సమ్మర్ కిట్స్ అందజేసిన డి.యస్.పి, ట్రాఫిక్ సి.ఐ

ప్రజాభూమి,పులివెందుల

కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని డి. ఎస్. పి మురళి నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఆదేశాలపై, మండుతున్న ఎండల్లో ప్రజల రక్షణకొరకు విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, తీసుకున్న నిర్ణయము మేరకు, కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వుల మేరకు పులివెందుల ట్రాఫిక్ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 23 మంది పోలీస్ సిబ్బందికి టోపీలు, చలువ కళ్ళద్దాలు, మాస్క్ లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్, వాటర్ బాటిల్ తో



కూడిన సమ్మర్ కిట్స్ ను పులివెందుల డి.యస్.పి బుక్కే మురళి చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డి.యస్.పి మాట్లాడుతూ వేసవి కాలంలో మండుటెండలో ట్రాఫిక్ విధులు నిర్వహిం చడం చాలా కష్టంతో కూడుకున్నదన్నారు. రోజంతా రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలు నిర్వర్తించే పోలీసు సిబ్బంది తీవ్రమైన ఎండ, వడగాల్పుల ప్రభావానికి గురికాకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర డిజిపి ఆదేశాలపై కడప జిల్లా యస్.పి నచికేత్ విశ్వనాత్ ఉత్తర్వుల మేరకు, వేసవిలో ఉపశమనం పొందడానికి ఈ సమ్మర్ కిట్స్ ను పులివెందుల ట్రాఫిక్ విధులు నిర్వర్తించే సిబ్బందికి అందజేయడమైనదన్నారు. ఈ సమ్మర్ కిట్లు పోలీసు సిబ్బందికి ఎండ ప్రభావం నుంచి కొంత ఉపశమనం కలిగించడమే కాకుండా, విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేం దుకు తోడ్పడతాయని పేర్కొన్నారు. అలాగే విధుల్లో ఉన్న సిబ్బంది వడదెబ్బ వంటి ప్రమాదకర పరిస్థితులకు లోను కాకుండా తరచూ నీరు, ఓ ఆర్ ఎస్ తాగడం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వేసవిలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రజలకి మెరుగైన సేవలందించాలని ఆయన సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంలో ఎంతో శ్రద్ధ తీసుకుం టూ వేసవిలో సమ్మర్ కిట్ ను అందించిన జిల్లా ఎస్పీ, డి.యస్.పి లకు సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ట్రాఫిక్ సి.ఐ జి.ప్రసాద రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులు, మహిళలు,రైతులు,వాలంటీర్లకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు

## ఓట్లు వేసి గెలిపించిన రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు - ర్యాలీకి భారీగా తరలివచ్చిన వైకాపా పార్టీ శ్రేణులు

## బాబు షూరిటీ,మోసం గ్యారెంటీ గా కూటమి ప్రభుత్వ పాలన ఉందన్న ఎంపీ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల

రాష్ట్రంలో నిరుద్యోగులు,మహిళలు , రైతులు, వాలంటీర్లకు వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు కృంగిపోతున్నారని,కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమని, చేతల ప్రభుత్వం కాదని ఓట్లేసి గెలిపించిన రాష్ట్ర ప్రజలను రెండేళ్లుగా మాయమాటలు చెబుతూ ముఖ్యమం త్రి చంద్రబాబు వెన్నుపోటు పొడుస్తున్నాడు. వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు దిట్ట అని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ మనోహర్ రెడ్డి, తొండూరు మండల వైకాపా ఇన్చార్జ్ వైయస్ మదనమోహన్ రెడ్డి, వైకా పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వి సతీష్ కుమార్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జయమ్మ పార్క్ లో వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయు డు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తున్నారన్నారు.వైయస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలన్నిటినీ కొన సాగిస్తామని, ఇంకా అదనంగా కొత్త పథకాలను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు అధికారం లోకి వచ్చిన తరు వాత సంక్షేమ పథకాలను అమలు చేయకుండా నమ్మిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వారన్నారు. రాష్ట్రంలో వాలంటీర్లకు వెన్నుపోటు పొడిచిన వెన్నుపోటు దారుడు చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రం లో 18 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500



అందిస్తామని చెప్పి అధికా రంలోకి వచ్చి రెండేళ్లయినా ఏ ఒక్కరికీ ఇచ్చిన పాపాన పోలేదని వారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చేలోపు ప్రతి ఒక్కరికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులకు మాయమాటలు చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని, నిరు ద్యోగ భృతి ఇవ్వలేదని వారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఏడాది ఆలస్యంగా ప్రారంభించిన చంద్రబాబు ఏడాది తిరక్కుండానే ఆర్టీసీ డిపోలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఉచిత బస్సు పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని వారన్నారు. సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తానని చెప్పాడని, మొదటి సంవత్సరం మొండిచేయి చూపి, రెండో సంవత్సరం ఆర కొరగా ఇచ్చారని, మూడో సంవత్సరం అసలు ఆ పథకంఅమలవుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొందని వారన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామ ని. ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు రైతులను నట్టేట ముంచారని వారన్నారు. జగనన్న పాల నలో రైతన్నలకు ఉచిత బీమా పథకాన్ని అమలు చేశారని వారు గుర్తు చేశారు. ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించాల్సి వస్తుందని, ఇది రైతులకు భారంగా మారిందని వారు మండిపడ్డారు. రాష్ట్రాన్ని




అతలాకుతం చేసిన మోంథా తుఫానుకు లక్షల ఎకరాల పంట దెబ్బతిందని, ఇప్పటి వరకు వారికి నష్టపరిహారం చెల్లించలేదని వారన్నారు. రైతులకు కనీసం సబ్సిడీలు కూడా అందించలేని పరిస్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉందని వారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశమంటాయన్నారు. రాష్ట్రంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అవస్థలు పడుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఆరోగ్య శ్రీని అటకెక్కించారన్నారు. జగనన్న హయాంలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొస్తే వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే దుకు కుట్రలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. 50 సంవత్సరాలకే ఎస్సీ ఎస్టీ బీసీలకు పెన్షన్ ఇచ్చా అని చెప్పి ఇంతవరకు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని ప్రచారం చేసుకుంటున్నారని,కూటమి పాలకులను చూసి ప్రజలు నవ్వుకుంటున్నార న్నారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మి ఓట్లువేసి మోస పోయామని ప్రజలు పశ్చాత్తాపం పడుతున్నారని,కులం చూడం మతం చూడం పార్టీలు చూడడం అని చెప్పి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నాయకులు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిలు అని వారు వారన్నారు. రాష్ట్రంలో రెండేళ్లపాటు రెడ్బుక్ రాజ్యాంగమే అమలు చేశారు తప్ప అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. అంతకుముందుగా వైఎస్ జగన్కు పూలమాలవేసి నివాళులర్పించా రు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు వరప్రసాద్, చిన్నప్ప, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్లపల్లె కిషోర్, సింహాద్రిపు రం మండలం వైకాపా ఇన్చార్జ్ దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వీరారెడ్డి, అర్జున్ రెడ్డి, చెన్నూరు కార్తీక్, సర్వోత్తమ్ రెడ్డి, అంబకపల్లె బాబు రెడ్డి, రిషికేశవరెడ్డి, చంద్రమౌళి,దాసరి చంద్రమౌళి, దాసరి ఈశ్వరయ్య, శ్రీరాములు, కోళ్ల భాస్కర్, తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిషోర్ ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమ ర్యాలీకి భారీగా తరలివచ్చిన మహిళలు

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలో వెన్నుపోటుకు రెండు సంవత్సరాలు పూర్తి ర్యాలీని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలో వైయస్ జయమ్మ పార్కు వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమానికి నాలుగో వార్డు మాజీ కౌన్సిలర్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నాలుగో వార్డు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తి విఫలమైందన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు దిక్కు తెలియని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమల ప్రధాత వైఎస్ జగనే అని మళ్లీ రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డి వైపు చూస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏదో ఒక రూపంలో ప్రతినెల ప్రతి ఇంటికి డబ్బులు వచ్చేయమని ఆయన అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే అది వైఎస్ కుటుంబంతోనే సాధ్యమ న్నారు. అంతకుముందుగా నాలుగో వార్డు మహిళలు ఎంపీ అవినాష్ రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు ప్రజలు, ఫైర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పోరుమామిళ్లలో భూ సమస్యల పరిష్కార వేదిక త్వరలోనే భూ పరిష్కారానికి కృషి కడప జాయింట్ కలెక్టర్ అదిత్ సింగ్

ప్రజాభూమి పోరుమామిళ్ల :




కడప జిల్లా పోరుమామిళ్లలోని పద్మావతి కళ్యాణ మండపంలో శుక్రవారం భూ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, బద్వేల్ ఆర్డిఓ చంద్రమోహన్, కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మాచూరి సూర్యనారాయణరెడ్డి, బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. పోరుమామిళ్ల. అట్లురు. కలసపాడు. నర్సాపురం. కాశినాయన. బికోడూరు. మండలాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు.భూ హక్కులు, సరిహద్దు వివాదాలు, పట్టాదారు పాస్బుక్కులు, భూ రికార్డుల సవరణలు తదితర సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.తమ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని బాధితులు కోరారు. కార్యక్రమ ప్రాంగణం ప్రజలతో కిక్కిరిసిపోయాయి అర్జీలు సమర్పించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులుహామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జనసేన పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భూ సమస్య పరిష్కార వేదిక ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని ప్రజలు ఇచ్చిన అర్జీలను బుట్ట దాఖలు చేయకుండా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల తహసిల్దార్ విజయకుమార్ అన్ని మండలాల తాసిల్దారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి..!

## ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్ఫ్రీ హెల్ప్లైన్ నెంబర్ :

## 1800 233 2447

ప్రజాభూమి ప్రతినిధి,కడప: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లాలో ప్రజలు చురుకుగా సహకరించాలని.. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. బాల కార్మికులపై సమాచారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1800 233 2447 కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. గృహ సేవలు, నిర్మాణ రంగం, చిన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల్లో పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. బాల కార్మికులను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారి రక్షణకు సహకరించాలని కోరారు.బాల కార్మికులను నియమించడాన్ని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) సవరణ చట్టం--1994ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం బాలలను పనిలో పెట్టుకునే యజమానులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్న డాక్టర్ నాగరాజు, చిన్నారుల విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్తు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా సమాజం ఏకతాటిపైకి వచ్చి చిన్నారులకు విద్యాభ్యాసం, సంరక్షణ మరియు సురక్షితమైన బాల్యాన్ని అందించేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బాల్యం చదువుకోవడానికి, ఎదగడానికి... పనులు చేయడానికి కాదు. బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలి" అని డిఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు.

# కోరిన కోరికలు తీర్చే చౌడమ్మ తల్లి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన అధిక జ్యేష్ఠ మాసము చివరి శుక్రవారము పురస్కరించుకుని ఉదయాస్త మాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చన,మహా మంగళ హారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆది,మంగళ,శుక్రవారములు,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి 108 ప్రదక్షిణములు చేసి 108 పసుపు కొమ్ముల మాల సమర్పించి నమస్కరించిన యెడల కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకము.కష్టాలలో ఉన్నపుడు అమ్మను స్మరించిన కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకము.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు పూర్తి

## ర్యాలీకి తరలివచ్చిన బి.వి ఎస్ ఆర్ ట్రాన్స్పోర్ట్ యజమాని సుబ్బారెడ్డి

ప్రజాభూమి, పులివెందుల




వైకాపా అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం ఇనగనూరు గ్రామ సమీపంలో ఉన్న బి వి ఎస్ ఆర్ ట్రాన్స్పోర్ట్ గ్యారేజ్ లో నుండి బివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు పూర్తి ర్యాలీ కార్యక్రమానికి తరలివచ్చా రు. ఈ సందర్భంగా బివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమం త్రి అయిన తర్వాత వాటిని విస్మరిస్తున్నారన్నారు. మాట తప్పి మడమ తిప్పి ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేది అన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు అప్పుల ఊబిలో కూరుకు పోయారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రెండు సంవత్సరాలు రాష్ట్రం లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు జరిగిందన్నారు. ప్రజలు ఇకపై చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విజయోత్సవ సభకు భారీగా తరలిన జనసేన శ్రేణులు



ప్రజాభూమి, సిద్ధవటం: కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా తిరుపతి జిల్లా చంద్రగిరిలో నిర్వహించిన విజయోత్సవ సభకు రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి క్రిష్ణ ఆధ్వర్యంలో సిద్ధవటం, ఒంటిమిట్ట, కడప ప్రాంతాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా అతికారి క్రిష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. విజయోత్సవ సభలో రాష్ట్ర నాయకుల ప్రసంగాలు కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయని తెలిపారు. సభకు హాజరైన జనసేన నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు, నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని పలు మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి సభ విజయవంతం కావడంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట.. రహదారిపై గోతులు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాచుపల్లి గ్రామం వద్ద పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు అధికారులు శుక్రవారం సంయుక్తంగా చర్యలు చేపట్టారు. వాహనాలు వెళ్లకుండా జేసీబీ యంత్రంతో రహదారిపై గోతులు తవ్వించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు జూన్ నుంచి అక్టోబర్ 15 వరకు పెన్నా పరివాహక ప్రాంతాల్లో ఇసుక రవాణాపై ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. అనుమతులు పొందిన డంపింగ్ యార్డులకు మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్ఐ హారిక ఆధ్వర్యంలో చేపట్టిన ఈ చర్యల ద్వారా అక్రమ ఇసుక రవాణాను అరికట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మలేరియా నివారణకు అప్రమత్తత అవసరం



ప్రజాభూమి, సిద్ధవటం: మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి ఆదేశాల మేరకు మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం, ప్రతి శుక్రవారం 'డ్రై డే--ఫ్రైడే' పాటించడం, రాత్రివేళల్లో దోమతెరలు వినియోగించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్యం -- పంచాయతీ సెక్రెటరీ నవీన



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని కడపాయపల్లె గ్రామంలో శుక్రవారం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ నవీన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. హరిత రాయబారులు తీసుకొచ్చే గ్రీన్ అంబాసిడర్ వాహనంలోనే చెత్తను వేయాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, రాత్రివేళల్లో వీధి దీపాల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# అటవీ అనుమానిత ప్రాంతాల్లో విస్తృత కూంబింగ్



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని గొల్లపల్లి, మద్దూరు బిట్లలోని అనుమానిత అటవీ ప్రాంతాల్లో శుక్రవారం విస్తృత కూంబింగ్ నిర్వహించినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలిపారు. కడప డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు అటవీ సిబ్బంది అణువణువునా తనిఖీలు చేపట్టారని చెప్పారు. అటవీ సంపద సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సభకు వాకాడు నుంచి భారీగా తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

తిరుపతిలో శుక్రవారం రోజున ఘనంగా నిర్వహించిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సభకు వాకాడు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.టీడీపీ సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు సభకు తరలివెళ్లి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ విజయోత్సవ సభలో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, టిడిపి నాయకుడు వేము దినకర్ బాబు, టీడీపీ యువ నాయకులు హర్షానంద, కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నాయకులు కార్యకర్తలకు వివరించినట్లు తెలిపారు.సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాకాడు మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిరసన



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు... ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.... నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎక్కడ, మహిళలకు 1500 రూపాయలు ఎక్కడ, మెగా డీఎస్సీ ఎక్కడ, ఆరోగ్యశ్రీ ఎక్కడ, గ్యాస్ మరియు పెట్రోల్ డీజిల్ ధరల పెంపుపై సమాధానం ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేసిన సత్యవేడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ నూక తోటి రాజేష్.... బుచ్చినాయుడు కండ్రిగ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మని నాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో ఈ కార్యక్రమం జరగడంతో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

### ప్రజారోగ్యంపై అధికారుల నిర్లక్ష్యమా?




ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

వరదయ్యపాలెం, తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం సచివాలయ పరిధిలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పూర్తై దాదాపు నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం స్థానిక ప్రజల్లో ఆందోళనకు గురిచేస్తోంది. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే క్లినిక్‌ను ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని స్థానికులు, సామాజిక కార్యకర్త ఓడూరు డిమాండ్ చేశారు. బత్తలవల్లం పంచాయతీ పరిధిలో స్థానిక జనాభాతో పాటు సమీపంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు నివసిస్తున్నారు. అదేవిధంగా చుట్టుపక్కల ఐదు పంచాయతీల ప్రజలు కూడా వైద్య అవసరాల కోసం ఈ ప్రాంతంపైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం ప్రజలు వైద్య సేవల కోసం సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బత్తలవల్లం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తక్షణమే ప్రారంభించి వైద్య సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు. "ప్రజారోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. నిర్మాణం పూర్తయిన ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి" అని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కూరపాటి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సభకు బయలుదేరిన బస్సులు.

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.



ఎన్డీయే కూటమి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పాలనకు రెండేళ్ళు పూర్తి అయిన సందర్భంగా విజయోత్సవ సభ తిరుపతి సమీపంలోని దామినేడు వద్ద భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కూరపాటి శంకర్ రెడ్డి




మరియు వరదయ్యపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యుగంధర్ రెడ్డి ఆదేశంతో క్లస్టర్ ఇంచార్జి మల్లి నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వరదయ్యపాలెం మండలం నుంచి బయలుదేరుతున్న బస్సులు కార్లు పెద్ద ఎత్తున కార్యకర్తలు మహిళలు బయలుదేరి వెళ్లడం జరిగింది

## ఎన్డీఏ బహిరంగ సభలో పాల్గొన్న నాయుడుపేట టిడిపి నేతలు



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

తిరుపతి పట్టణ సమీపంలోని దామినేడు వద్ద శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్డీఏ కూటమి బహిరంగ సభలో నాయుడుపేట పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. నాయుడుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కె.అశోక్ కుమార్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి చిట్టేటి చెంచయ్య,మాజీ జడ్పిటిసి సభ్యులు పేరంశెట్టి శ్రీరామ్ ప్రసాద్, గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యులు పల్లమాల రామిరెడ్డి,తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు చెందేటి సుజాత, మాజీ ఎంపీపీ తుపాకుల కన్నెమ్మ తదితరులు ఎన్డీఏ కూటమి బహిరంగ సభలో పాల్గొన్నారు.

## నిల్వ ఉంచి కుళ్లిన మాంసాహారం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం







ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్. మటన్ మార్కెట్లో బయట పడ్డ నిల్వ ఉంచి దుర్వాసనతో కూడిన మాంసం.కుళ్ళిన, నిల్వ ఉంచిన మాంసాహారం, ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ వ్యాపారులను హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన మేకలు, పొట్టేలకు సంబంధించిన కాళ్లు, తలకాయలు వంటివి నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని ప్రజల పిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం 28వ వార్డులోని పెద్ద పీర్ల చావడి లోని మటన్ మార్కెట్ ను పారిశుధ్య సిబ్బంది తో కలసి హెల్త్ ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి తీసుకువచ్చిన మాంసం ఇక్కడ ఫ్రీజర్లలో నిల్వ ఉంచి పలు హోటళ్లకు, ప్రజలకు విక్రాయిస్తున్నారని పిర్యాదులు అందాయని తెలిపారు. కమిషనర్ శారదా దేవి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా దాడులు నిర్వహించడం జరిగింది.

## మంత్రి నారా లోకేష్ కి ఘన స్వాగతం పలికిన ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట ఎయిర్ పోర్ట్ లో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి సాదర స్వాగతం పలికిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, తిరుపతిలో నిర్వహిస్తున్న 'సంక్షేమ విజయోత్సవ సభలో పాల్గొనేందుకు రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు , కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కి రాష్ట్ర మంత్రులు,కూటమి నాయకులు, కార్యకరలతో కలిసి సాదర స్వాగతం పలికారు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ బాబు గారు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ని ఆత్మీయంగా పలకరించి, ఆలింగనం చేసుకున్నారు.

## రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆం.ప్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

: తిరుపతి జిల్లా ఒక్క రోజు పర్యటన నిమిత్తం నేటి శుక్రవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆం.ప్ర. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్,కి ఘన స్వాగతం పలికారు. జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ



మంత్రి అనగాని సత్యప్రసాద్,జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, చిత్తూరు ఏం పి దగ్గుమల్ల ప్రసాదరావు. తిరుపతి, కాళహస్తి, కోడూరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు బొజ్జల సుధీర్ రెడ్డి అరవ శ్రీధర్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ హరి ప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి, మిథున్ శాలి, కూటమిప్రభుత్వ ప్రజాప్రతినిధులు తదితరులుస్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు.

## రేణిగుంట ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఐటీశాఖ మంత్రి, నారాలోకేష్,కు ఘనస్వాగతం లభించింది



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

తిరుపతి జిల్లా శుక్రవారం ఒకరోజు పర్యటన నిమిత్తం రేణిగుంట ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు, స్వాగతం పలుకుతున్న, కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు , కాలాస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, అనంతరం రోడ్డు మార్గాన, దామినేడు వద్ద ఏర్పాటుచేసిన, రెండేళ్లు పూర్తయిన, కూటమిపాలన సభకు బయలుదేరి వెళ్లారు.

## ఒక్క రోజు తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన ముఖ్యమంత్రి కి, సాదర వీడ్కోలు

ప్రజాభూమి ప్రతినిధి రేణుగుంట

ఒక్క రోజు తిరుపతి జిల్లా పర్యటన అనంతరం శుక్రవారం రేణిగుంట విమానాశ్రయం నుండిసాయంత్రం 3.25 గంటలకు తిరుగు పయనమైన, ఆం.ప్ర రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కు ,,కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కు,, ఆం.ప్ర రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు , రేణిగుంట ఎయిర్ పోర్ట్ లో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, డి ఐ జీ షిమోజి బాయ్,జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, చంద్రగిరి శ్రీకాళహస్తి, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, హ్యాండీక్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టె సాయి, శ్రీకాళహస్తి ఆర్ డి ఓ బానుప్రకాష్ రెడ్డి రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు, తదితర అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.



# చదువా... వ్యాపారమా?

### ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై చర్యలు ఎప్పుడూ?

### చదువు కొనే రోజులా? ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై తల్లిదండ్రుల ఆగ్రహం

### విద్య పేరుతో వసూళ్ల పర్వం... నియంత్రణ ఎక్కడ?



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయనే ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి, అడ్మిషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజులు, అభివృద్ధి నిధులు, ఇతర రకాల పేర్లతో భారీ మొత్తాలను వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా యూనిఫార్ములు, నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్‌ను నిర్దిష్ట దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ, ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించడం ద్వారా మరింత దోపిడీకి పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాల తమ పాఠశాలలో తరగతి వారీగా వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉన్నప్పటికీ, జిల్లాలోని అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఈ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నాయి. ఫీజుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించకపోవడంతో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు.ఇక జిల్లాలోని కొన్ని పాఠశాలలు తప్పుడు పత్రాలు, అసంపూర్ణ అనుమతులతోనే నిర్వహణ కొనసాగిస్తున్నాయనే ఫిర్యాదులు కూడా భారీగా వెలువడుతున్నాయి. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లోనూ అనేక లోపాలు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా అగ్నిప్రమాదం వంటి అత్యవసర పరిస్థితులు తలెత్తితే విద్యార్థులు సురక్షితంగా బయటపడేందుకు అవసరమైన మార్గాలు, భద్రతా ప్రమాణాలు లేకుండా కొన్ని పాఠశాలలు కొనసాగుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఒకే అనుమతితో నాలుగు నుంచి ఐదు శాఖలను నిర్వహిస్తూ కొన్ని విద్యాసంస్థలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టి, ఫీజుల దోపిడీ, భద్రతా లోపాలు, అనుమతుల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి."చదువు నేర్పే ఆలయాలుగా ఉండాల్సిన పాఠశాలలు, చదువు కొనాల్సిన మార్కెట్లుగా మారకూడదు" అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడిబాక గ్రామ పంచాయతీ రాజులకండ్రిగ టీడీపీ క్లస్టర్ గుండ్రాజు మురళి రాజు




ప్రజాభూమి ప్రతినిధి ఏర్పేడు

రాజులకండ్రిగ టీడీపీ క్లస్టర్ గుండ్రాజు మురళిరాజు మరియు మనోహర్ నాయుడు,తెలుగుదేశం పార్టీ నాయకులు గుండ్రాజు మురళి రాజు, మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలో జరుగునున్న ఎన్ డి ఏ భారీ బహిరంగ సభకు రాజులకండ్రిగ గ్రామం మరియు ముసలిపేడు నుండి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు భారీగా తరలి వెళ్లారు.ఈ సందర్భంగా రాజులకండ్రిగ టీడీపీ క్లస్టర్ గుండ్రాజు మురళి రాజు మాట్లాడుతూ రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించేందుకు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయడం కోసంశ్రీ కాళహస్తి మీూా వెంకటసుధీర్ రెడ్డి ఏర్పేడు మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు సూచనల మేరకు రాజులకండ్రిగ గ్రామంమరియు ముసలిపేడుగ్రామం నుండి మహిళలు మరియు పురుషులు కలిపి 50 మంది భారీ సంఖ్యలో తిరుపతిదగ్గర దామినేడు సభకు బయలుదేరి వెళుతున్నట్లు తెలియజేశారు.

# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

### -కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి.



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణమైన ఆరోగ్యంతో జీవించగలమని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని గోపాల్ రాజు కాలనీ, ఆర్. సి రోడ్డు, ప్రకాశం పార్క్ పక్కన గల సప్తగిరి నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కాలువలు, చెత్త కుప్పలు, తదితర వాటిని శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా అవగాహన పెంచుకుని మన ఇంటితో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కువ భాగం వ్యర్థాలను ఇంట్లోనే ఉంచుకుని కాలువల్లో, రోడ్డు పక్కన పడేస్తున్నారని తెలిపారు. దీని వలన నగర శుభ్రతకు ఆటంకంగా మారుతోందని తెలిపారు. ప్రజలందరూ తడి, పొడి చెత్త వేరు చేసి ఏ రోజుకారోజు మీ వీధిలోకి వచ్చే మా సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రజలందరూ భాగస్వాములై నగర స్వచ్ఛత కు, శుభ్రతకు సహకరించాలని కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి. ఈ. లు మహేష్, ప్రసాద్, మధు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ భారీ నిరసన ర్యాలీ..!

### 'వెన్నుపోటుకు రెండేళ్లు' అంటూ కూటమి ప్రభుత్వంపై ఆగ్రహ జ్వాలలు..

### క్లాక్ టవర్ నుంచి పట్టణ వీధుల వరకు నినాదాలతో మార్మోగిన చంద్రగిరి..



ప్రజా భూమిప్రతినిధి, చంద్రగిరి:

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం చంద్రగిరిలో నిర్వహించిన "వెన్నుపోటుకు రెండేళ్లు" భారీ నిరసన ర్యాలీ రాజకీయంగా సంచలనంగా మారింది. చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద వేలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో పట్టణం నినాదాలతో దద్దరిల్లింది. చిత్తూరు పార్లమెంట్ పరిశీలకుడు చవ్వా రాజశేఖర్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పార్టీ శ్రేణులు కూటమి ప్రభుత్వ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ హామీ పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. "చెట్టుమీద కొంగ.. చంద్రబాబు దొంగ", "సూపర్ సిక్స్.. సూపర్ మోసం", "వెన్నుపోటు ప్రభుత్వం మాకొద్దు", "అబద్ధాల బాబు మాకొద్దు" అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాలు, ప్లకార్డులతో సాగిన ర్యాలీ స్థానిక ప్రజల దృష్టిని




ఆకర్షించింది. ఈ సందర్భంగా మాట్లాడిన చవ్వా రాజశేఖర్ రెడ్డి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజల తరఫున వైఎస్ జగన్ చేస్తున్న పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా మద్దతు పెరుగుతోందన్నారు. మీడియాతో మాట్లాడిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, "ప్రజలకు ఏమి చేశారని రెండేళ్ల సంబరాలు చేసుకుంటున్నారు? నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి?" అని ప్రశ్నించారు. ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వాన్ని సాగనంపే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, చంద్రగిరి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ఆరోపించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు.భారీ జనసందోహం, ప్రభుత్వ హామీల పత్రాలు దహనం, హోరెత్తించిన నినాదాలతో చంద్రగిరిలో జరిగిన భారీ నిరసన ర్యాలీ జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 9

శనివారం 13 జూన్ 2026

# "శ్రీకాళహస్తిలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన ర్యాలీ

- కూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రజా వ్యతిరేక పాలనపై శ్రీకాళహస్తిలో వైఎస్సార్సీపీ భారీ నిరసన ర్యాలీ.

- మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ. ఎమ్మెల్సీ

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

పాత రామసేతు వంతెన (పాత బ్రిడ్జి) నుండి వైయస్సార్ సర్కిల్ వరకు కదంతొక్కిన నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న వెన్నుపోటును ఎండగట్టిన వైఎస్సార్సీపీ శ్రేణులు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన జ్వాలలు మిన్నంటాయి.శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సారథ్యంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" అనే నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ భారీ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి పార్లమెంట్ ఎంపీ డాక్టర్.మద్దెల గురుమూర్తి , ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమం స్థానిక పాత రామసేతు వంతెన (పాత బ్రిడ్జి) వద్ద అత్యంత భారీ జనసందోహం నడుమ ప్రారంభమైంది. అక్కడ నుంచి వైఎస్సార్సీపీ ప్రముఖ నాయకులు,కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలతో కలిసి వైయస్సార్ సర్కిల్ వరకు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు.కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసిన అన్యాయాలను, ఇచ్చిన హామీలను గాలికొదిలేసి వెన్నుపోటు పొడిచిన తీరుపై నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ప్రజలను నమ్మించి వంచించడమే ధ్యేయంగా పెట్టుకుంది. ఈ రెండేళ్ల పాలన కేవలం ప్రజల వెన్నుపోటుకు నిదర్శనం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని,ప్రజా వ్యతిరేక విధానాలపై మా పోరాటం ఇలాగే కొనసాగుతుంది అని వారు స్పష్టం చేశారు.చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ర్యాలీ కార్యక్రమం ద్వారా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుకు ఈ నిరసన ర్యాలీ ద్వారా తీసుకువస్తున్నాం అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది అని అన్నారు.యువతకు ఉద్యోగాలు, మహిళలకు సంక్షేమం,



రైతులకు భరోసా, పేదలకు అభివృద్ధి అనే పేరుతో ఎన్నో హామీలు ఇచ్చారు. ఆ హామీలు ఎంతవరకు అమలయ్యాయో ప్రజలే పరిశీలించాలి. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతిపక్షంగా మా బాధ్యత. ప్రజల తరపున నిలబడి వారి గొంతుకగా పనిచేయడం మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాము. గతంలో ప్రతినెల జగనన్న సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలు నేడు ఒక్క సంక్షేమం కూడా అందకుండా దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రజలందరూ బాగుండాలి మా అక్క చెల్లెలు అందరూ బాగుండాలని జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఇచ్చిన మాటను తప్పకుండా అమలు చేసిన మంచి మనసున్న మనిషినీ ఓడించామని ప్రజలందరూ బాధపడుతున్నారు. 2027 లో జగనన్న ప్రాథయాత్ర ప్రారంభం అవ్వగానే ప్రజలందరూ స్వచ్ఛందంగా జగనన్నకు ఎలా బ్రహ్మరథం పడతారో మీరందరూ చూస్తారు.మరలా జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలందరూ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, వైఎస్సార్సీపీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పార్లమెంట్ పరిశీలకులు ఓడూరు గిరిధర్ రెడ్డి,ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు,జడ్పిటిసి సంధ్యా, ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి,కొగిలి సుబ్రహ్మణ్యం, చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి,కిషోర్ రెడ్డి,గంగారి రమేష్,కునాటి రమణయ్య యాదవ్, పగడాల రాజు,సిరాజ్ బాషా, కంట ఉదయ్ కుమార్, రేణిగుంట ప్రభాకర్, కోవి చంద్రయ్యః నాయుడు,కొత్తపాటి శ్రీనివాస్ రెడ్డి,పఠాన్ ఫరీద్, శ్రీ వారి సురేష్,గోరా,మున్నా రాయల్,బుల్లెట్ జై శ్యామ్ రాయల్,కోలూరు హరి నాయుడు,పులి రామచంద్ర, శివ కుమార్ యాదవ్, ఫజల్, నాగేష్,పెరుమాల్ చౌదరి, ఆర్కాడ్



శేఖర్ , డాక్టర్ శంకర్, ఆర్కార్డు ముత్తు, బాబు, మొగరల గణేష్, జనార్దన్ యాదవ్, అప్పిని సుధాకర్, ముని కృష్ణారెడ్డి, చింతా రాజేంద్ర, వెంకీ,ఆరిఫ్, ఎక్స్ కౌన్సిలర్ మహబూబ్ బాషా, ఎక్స్ కృష్ణ,గఫూర్, శివకుమార్ యాదవ్,కామి వెంకటేశ్వర, , సుమతమ్మ, సాగర్ బి, షర్మిల ఠాగూర్, ముని లక్ష్మి, మాధవి, రాజేశ్వరి, భారతి, శంకర్, కిరణ్,అస్లాం, కొట్టే శరవణ, బాలిశెట్టి శేఖర్, ఆర్ అట్ల రమేష్, జూమ్లేష, ఖాదర్ బాషా, గౌస్ బాషా,జిలాని,జీవికే రెడ్డి, రాజారెడ్డి, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి,కుమార్,గంగయ్య,మునిశేఖర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, పర్వీన్, గిరి,షబ్బీర్,ఖాదర్,ఖదీర్, శేషారెడ్డి,కన్నయ్య,లతా, శశికిరణ్, మోహన్, శీను, అలీ భాష, మనీ నాయుడు,భాస్కర్, శ్రీరాముల్ రెడ్డి, గెరటారెడ్డి,శంకరయ్య, హరి నాయుడు, షరీఫ్,చింతా రాజేంద్ర, రఘురామయ్య, రఘునాథ రెడ్డి, సురేష్ రెడ్డి, జగదీశ్వరయ్య, గంగాధరం, సుబ్బయ్య, వెంకీ, భాస్కర్,అలయ్య, గిరి రెడ్డి, ఆనంద్, సుబ్రహ్మణ్యం నాయుడు, సుబ్రహ్మణ్యం యాదవ్, తిరుపాల్, శ్రీనివాసులు, ప్రసాద్, సాయిబాబా నాయుడు, పెరుమాల్ రెడ్డి,మునిరాజ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి,రంగినేని చెంచయ్య నాయుడు, వైస్ ఎంపీపీ అక్కుపల్లి భానుమూర్తి యాదవ్, చంద్ర రఘునాయుడు వయ్యాల మనోహర్ రెడ్డి చెలికం నాగరాజు రెడ్డి, చెర్లోపల్లి వెంకటేశ్వర నాయుడు, ఓబులాయ యపల్లి మాజీ సర్పంచ్ పోలి రెడ్డి, అక్కుర్తి మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాద మాల వెంకట్ రెడ్డి, యానాది శివకుమార్, బంగారు దిలీప్ కుమార్, దుద్ది రంగయ్య, బిల్లు చంద్రబాబు యాదవ్, పాగల రవీంద్ర రెడ్డి, గంగిరెడ్డి, మున్రత్నం రెడ్డి, బాలి రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, మునిరాజ, రవి శేఖర్ బాబు, రామచంద్రయ్య, సురేష్, పోలయ్య, నక్క పెంచలయ్య, పురుషోత్తం, తాటిపర్తి సురేంద్ర రెడ్డి, నరసింహ రెడ్డి, శేఖర్ యాదవ్, కొండయ్య, శశిరాయల్, రాజారెడ్డి, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు నాయుడు, ప్రసాద్ నాయుడు, గోవిందరావుపల్లి కోటేశ్వరరావు, గురునాథం రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, మాధమల చంద్రారెడ్డి, వేలవేడు తిరుపాల్ యాదవ్, చెంచురామయ్య, కుంటి పూడి కోటేశ్వరరావు, డివి రమణ, ముద్దుమూడి గురవయ్య, రెడ్డివారి గురువారెడ్డి, చుక్కల ఎల్లయ్య మరియు శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవెల్ ఏజెంట్లు రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులు మరియు వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింహవాహనంపై భక్తులకు అభయమిస్తున్న శ్రీ ప్రసన్న రంగనాథ స్వామి

## బ్రాహ్మణపట్టులో అంగరంగ వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు -- భక్తుల ఆనందోత్సాహం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతి సమీపంలోని బ్రాహ్మణపట్టు గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న రంగనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల గోవింద నామస్మరణల మధ్య అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నేడు ఉదయం శ్రీ ప్రసన్న రంగనాథ స్వామివారు సింహ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు. సింహ వాహనంపై కొలువుదీరిన స్వామివారి మహిమాన్విత రూపాన్ని దర్శించిన భక్తులు పరవశించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మ పరిరక్షణకు, దుష్ట శిక్షణకు ప్రతీకగా భావించే సింహ వాహనంపై స్వామివారి విహారం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది. తమ భక్తుల కోరికలను ఆలకిస్తూ, వారి అభీష్టాలను నెరవేర్చే కల్పవృక్షంగా శ్రీ ప్రసన్న రంగనాథ స్వామివారు



వెలుగొందుతున్నారని గ్రామ ప్రజలు విశ్వాసం వ్యక్తం చేశారు. స్వామివారి కృపాకటాక్షాలతో గ్రామంలో సుఖశాంతులు, ఐశ్వర్యాలు వెల్లివిరుస్తున్నాయని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భజనల మధ్య సాగిన సింహ వాహనోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.బ్రాహ్మణపట్టు గ్రామ ప్రజలు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను ఇదే విధంగా ఘనంగా నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, స్వామివారి అనుగ్రహంతో ఈ ఉత్సవాలు మరింత వైభవంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ దివ్యోత్సవాలకు సహకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, సేవకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.స్వామివారి దివ్య ఆశీస్సులతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది.

# తిరుపతి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న మాంసం మాఫియా..!

## పి.పి. చావడి మటన్ మార్కెట్‌లో కుళ్లిన మాంసం వ్యవహారంపై ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ తీవ్ర ఆగ్రహం

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో పి.పి. చావడి మటన్ మార్కెట్ కేంద్రంగా వెలుగులోకి వచ్చిన కుళ్లిన మేక, గొర్రె తలలు, కాళ్ల సరఫరా వ్యవహారాన్ని ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ తీవ్రంగా ఖండించింది. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి లాభాల కోసం కొందరు వ్యాపారులు ఇటువంటి చర్యలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల నుంచి పాచిపోయిన, నిల్వ ఉంచిన మేక, గొర్రె తలలు, కాళ్లను తిరుపతికి తరలించి విక్రయిస్తున్నారనే వార్తలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేశాయని తెలిపారు. తిరుపతి వంటి అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన పుణ్యక్షేత్రానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు, పర్యాటకులు వస్తుంటారని, వారి ఆరోగ్యంతో చెలగాటం ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీ మొత్తంలో నాసిరకం మాంసం వెలుగులోకి రావడం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో అర్థమవుతోందన్నారు. ప్రజలకు విక్రయించే ఆహార పదార్థాల విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని, ఆహార భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించిన వారిని గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పి.పి. చావడి మటన్ మార్కెట్‌లో తరచూ ఆరోగ్య భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మార్కెట్‌ను జనావాస ప్రాంతం నుంచి అనువైన ప్రదేశానికి తరలించే అంశాన్ని ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు అత్యవసరంగా పరిశీలించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న వారిపై కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపించేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే తిరుపతి నగరంలోని అన్ని మాంసం విక్రయ కేంద్రాలు, హోటళ్లు, మెస్‌లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది.తిరుపతి ప్రజల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించకూడదని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఆదర్శప్రాయమైన చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ ప్రతినిధులు కోరారు.

# వైఎస్ఆర్ సి పి నాయకుడు సూరి జన్మదిన వేడుకలు..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద శుక్రవారం వైఎస్ఆర్ సిపి నాయకుడు సూరి జన్మ దినం సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, మల్లం చంద్రమౌళి రెడ్డి, సిద్దిక్ భాష, దయ, తిరుపతిరూరల్ ఎంపీపీ మాధవ రెడ్డి పాల్గొన్నారు.



# శివయ్య సేవలో పారిశ్రామికవేత ముఖేష్ అంబానీ కుమారుడు అనంత అంబానీ



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వాయు లింగేశ్వర స్వామి వారి దర్శనం. ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ శ్రీకాళహస్తి దేవస్థానాన్ని సందర్శించారు. వారికి ఆలయ బృందంతో కలిసి ఘనస్వాగతం పలికి, రాహుకేతు పూజలు మరియు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారితో శ్రీకాళహస్తి క్షేత్ర అభివృద్ధిపై, అంతర్జాతీయ కథనాల్లో మన ఆలయ ప్రగతి గురించి వచ్చిన వార్తలపై సుదీర్ఘంగా చర్చించాము. అలాగే,



వేల ఏళ్ల చరిత్ర గల గుడిమల్లం పరశురామేశ్వర ఆలయ విశిష్టతను కూడా వారికి వివరించడం జరిగింది. ఆలయాల అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేసిన అనంత్ అంబానీ .. రాబోయే మహాశివరాత్రి ఉత్సవాల నాటికి శ్రీకాళహస్తి మరియు గుడిమల్లం ఆలయాల అభివృద్ధి పనులకు తన వంతుగా నిధులు, పూర్తి సహకారాన్ని అందిస్తానని మాట ఇవ్వడం ఎంతో సంతోషాన్నిచ్చింది. నియోజకవర్గ ఆధ్యాత్మిక ప్రగతికి తోడుగా నిలుస్తున్న వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు." చారిత్రాత్మక వైభవం దిశగా మన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్థానిక నాయకులు ఆలయ అధికారులు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ మిట్ట గంగమ్మ గర్భగుడి పునఃనిర్మాణానికి రూ.50,116 విరాళం..!

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:



చంద్రగిరి పట్టణంలో కొలువైన శ్రీ మిట్టమీద గంగమ్మ దేవాలయ గర్భగుడి పునఃనిర్మాణ పనులకు భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చంద్రగిరి ఆంజనేయ పురం వాస్తవ్యులు వ్యాపారవేత్త కె గోవిందయ్య, గుర్రమ్మ దంపతులు ఆలయ అభివృద్ధి కొరకు తమ వంతు సహాయంగా రూ. 50,116/- లు నగదును విరాళంగా అందజేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ విరాళం మొత్తాన్ని ఆలయ ధర్మకర్త మొక్కల చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు మొక్కల కార్తీక్ రెడ్డికి అందించారు. దేవాలయ గర్భగుడిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు భక్తులు ఇలా ముందుకు రావడం అభినందనీయమని ఈ సందర్భంగా ధర్మకర్త కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి సుబ్బు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి, విరాళం అందించిన దాతలకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

# ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష - రూ. 3 లక్షలు జరిమానా

## తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3 లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ పీ. శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీ జె. కులశేఖర్ గారి పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ద తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 14/2018 కేసులో ఇద్దరు ముద్దాయిలు తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీట్ అటవీ పరిధిలోని చామల రేంజ్ లో అరెస్టయ్యారు. వీరు తమిళనాడు, తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా పడిమలై గ్రామానికి చెందిన అప్పస్వామి, కాశీ లు కాగా వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ.3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న టాస్క్ ఫోర్స్ దర్యాప్తు అధికారులను, కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

# రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి సంక్షేమం కూటమి సభకు శ్రీకాళహస్తి పట్టణం నుండి వేలాది మంది కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లారు. అందులో భాగంగా ఎన్టీఆర్ నగర్ యూనిట్ నెంబర్ 13కి సంబంధించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి మరియు యూనిట్ ఇంచార్జ్ నెమళ్లూరు బుజ్జి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలతో పట్టణ పార్టీ అధ్యక్షులు గెడిపూడి విజయ్ కుమార్ క్లస్టర్ ఇంచార్జ్ గాదిపాకుల గోపీనాథ్ సూచనలతో భారీ ఎత్తున తరలి వెళ్లారు. నేడు కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధిని రెండు కళ్ళు గా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నాయి. కాబట్టి రాష్ట్రంలోని ప్రజలందరూ కూటమి ప్రభుత్వాన్ని అండగా నిలవాలని మద్దతుగా నిలవాలని నెమళ్లూరు బుజ్జి కోరారు.

బూత్ ఇన్చార్జిలు ఆకుల సునీత,మెదూరు శివకుమార్, చెం బేటి బాలయ్య, పూల శేఖర్, కార్యకర్తలు శంకరయ్య, తేజ, రమేష్ బాబు, మహమ్మద్, చెంచురామయ్య, సాలర్ ఖాన్, హరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.కే.ఆర్. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ కె. రాంప్రసాద్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



గూడూరు లోని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ కె. రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ప్రిన్సిపాల్ గా తన విధులు ప్రారంభించారు. గతంలో కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడిగా, వైస్ ప్రిన్సిపాల్ గా పనిచేసి పదోన్నతి పొంది కమిషనర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు ప్రస్తుత ఎఫ్ఏసి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శివప్రసాద్ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ కు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు , విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. కె. రాంప్రసాద్ మాట్లాడుతూ కళాశాల పూర్వ వైభవానికి అన్ని విధాలుగా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 10
శనివారం 13 జూన్ 2026

# రెండేళ్ల వెన్నుపోటు పాలనకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆందోళన

## నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ -కార్యకర్తలకు దిశానిర్దేశం



ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ''రెండు సంవత్సరాల వెన్నుపోటు'' నిరసన కార్యక్రమం నిర్వహించారుమండల అధ్యక్షుడు కే. మణి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండలంలోని పెట్రోల్ బంక్ వద్ద నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రారంభమైన ర్యాలీ, వైఎస్సార్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రభుత్వ విధానాలు, ప్రజావ్యతిరేక నిర్ణయాలు, అన్యాయాలను నిరసిస్తూ నాయకులు నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నూకతోటి రాజేష్ మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు ప్రతి గ్రామంలో ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రజల పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయడంతో పాటు, రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల స్థాయి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ లక్ష్మీ గ్రూప్స్ అధినేత ప్రసాద్ చేయూత



ప్రజా భూమి ప్రతినిధి, వెదురు కుప్పం

చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం గుర్రం వారి కండ్రిగలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు శ్రీ లక్ష్మి గ్రూప్స్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని గుర్రం వారి కండ్రిగ గ్రామంలోని మండల పరిషత్



ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ లక్ష్మీ గ్రూప్స్ అధినేత కే. ప్రసాద్ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, నోట్‌బుక్స్, స్కూల్ అవసరాలకు సంబంధించిన ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు ఒక సంవత్సరం పాటు ఉపయోగపడే విధంగా విద్య సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కే. ప్రసాద్ మాట్లాడుతూ, “నేటి చిన్నారులే రేపటి భారతదేశ భవిష్యత్తు. విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాం. సమాజ సేవలో భాగంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తాము” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మి గ్రూప్స్ సిబ్బంది సోము, బన్నీ, శివ, పురుషోత్తం పాల్గొని విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేయడంలో సహకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నందగోపాల్ , ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



ప్రజా భూమి ప్రతినిధి తిరుమల

ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ శుక్రవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య



చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ ఆహ్వానించగా, అర్చకులు సాంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగ నాయకులు మండపం వద్ద ఆమెకు పండితులు వేదాశీర్వచనం అందించగా ఈవో, అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే రైతు ఆర్థికంగా అభివృద్ధి :రైతు చంద్రబాబు

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమం అభివృద్ధి కార్యక్రమంలో రైతు చంద్రబాబు



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం తోనే రైతు ఆర్థికంగా ఎదగగలడు అన్నారు. రామచంద్రపురం మండలం నేతకుప్పం చంద్రబాబు మాట్లాడుతూలి రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు గత 6 సంవత్సరాలుగా ప్రక్రుతి వ్యవసాయం చేస్తున్నానని, అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే సహజ కీటక నియంత్రణ ద్రావణాలను వినియోగిస్తూ పంటలు పండించి, మిగిలిన ఉత్పత్తులను ఇతర రైతులకు అందజేస్తూ ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేస్తున్నానని అన్నారు. అన్నదాత -- సుఖీభవ ద్వారా మొదటి విడతలో రూ.5 వేలు, పి.ఎం కిసాన్ ద్వారా రూ.2 వేలు, రెండవ విడతలో రూ.5 వేలు, మూడవ విడత రూ.4 వేలు, పిఎం కిసాన్ ద్వారా రూ. 6 వేలు నగదు జమ అయిందన్నారు. తాను వికలాంగుడునని ప్రభుత్వం వచ్చాక తనకు నెలకు




రూ.6 వేలు వికలాంగుల పింఛన్ అందుతున్నదని, తన తల్లికి రూ.4 వేలు వృద్ధాప్య పెన్షన్ వస్తున్నదని, తద్వారా సంవత్సారానికి రూ.1.20 లక్షల లబ్ది కలుగుతోందని తెలిపారు. రైతులకు అండగా ఉంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్డీఏతో వికాసం - గొడ్డలి పార్టీతో విధ్వంసం

## ప్రజా ప్రభుత్వం రెండేళ్లలోనే సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధికి కొత్త నిర్వచనం... మంత్రి నారా లోకేష్

ప్రజా భూమి ప్రతినిధి ,తిరుపతి

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి సాక్షిగా ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుందని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక దామినేడు వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మాధవ్, కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలు మరియు ప్రజలకు హృదయపూర్వక అభివాదాలు తెలియజేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రశాంతత నెలకొందని, గతంలో ఉన్నట్లుగా దాడులు, హత్యలు, రాజకీయ వేధింపులు, అసభ్య రాజకీయ సంస్కృతి ప్రస్తుతం కనిపించడం లేదన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా చంద్రగిరి గడ్డపై తాను చేసిన హెచ్చరికను గుర్తుచేస్తూ, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని అప్పటి ప్రభుత్వాన్ని హెచ్చరించానని, దేవుడితో పెట్టుకున్నవారి పరిస్థితి ఏమైందో ప్రజలు ఆలోచించాలని అన్నారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు రాయలసీమ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని, తెలుగు గంగ, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులకు రూపకల్పన చేయడంతో పాటు మహిళల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయం, నిత్య అన్నదానం వంటి కార్యక్రమాలు ప్రారంభించారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయాల్లో చంద్రబాబు నాయుడు ని విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్, బౌలర్లు మారినా బ్యాట్స్‌మన్ ఒకరే అన్నట్లుగా అభివృద్ధి రాజకీయాల్లో చంద్రబాబుకి ప్రత్యామ్నాయం లేదన్నారు. బిందు సేద్యం, హంద్రీ-నీవా, సుజల స్రవంతి వంటి కార్యక్రమాల ద్వారా రాయలసీమను అభివృద్ధి పథంలో నడిపించారని, ఇప్పుడు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ''మిషన్ రాయలసీమ'' ప్రారంభించబోతున్నారని తెలిపారు. 2019-



2024 మధ్య రాష్ట్రంలో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, అమర్‌నాథ్ గౌడ్, డాక్టర్ సుధాకర్, సుబ్రహ్మణ్యం, మిస్బా కుటుంబం వంటి సంఘటనలను ఉదాహరణగా పేర్కొంటూ, గత ప్రభుత్వ పాలనలో జరిగిన అన్యాయాలను ప్రజలు మరవలేదన్నారు. “వై నాట్ 175” అన్నవారికి ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేస్తూ తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కొందరు “రప రప” అంటూ హెచ్చరికలు చేస్తున్నారని, చట్టవ్యతిరేక చర్యలను ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల్లో వెనుకడుగు వేయలేదన్నారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్, వికలాంగులకు రూ.6,000, మంచానికే పరిమితమైన వారికి రూ.15,000 పెన్షన్ అందిస్తున్నామని చెప్పారు. మూసివేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, డీఎస్సీ ద్వారా 16,000 పైగా ఉపాధ్యాయ పోస్టులు, 6,000 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశామని, త్వరలో మరో 10,000 ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లు, మత్స్యకారుల సంక్షేమ కార్యక్రమాలు, మహిళలకు “స్త్రీ శక్తి” పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, “దీపం” పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని వివరించారు. “ఒకే రాష్ట్రం -- ఒకే రాజధాని, కానీ అభివృద్ధి వికేంద్రీకరణ” ప్రజా ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి భారీ పెట్టుబడులను ఉత్తరాంధ్రకు, క్వాంటం వ్యాలీని కోస్తాంధ్రకు, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఫైటర్ జెట్ తయారీ పరిశ్రమలను రాయలసీమకు తీసుకువచ్చిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో అడ్డంకులు సృష్టించిన వారే ఇప్పుడు వాటికి క్రెడిట్ తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి సంస్థల పెట్టుబడులను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేసి, ఇప్పుడు వాటిని తమ విజయాలుగా చెప్పుకోవడం విచిత్రమన్నారు. డీఎస్సీ నియామకాలపై గతంలో వందలాది కేసులు వేసినా, కేవలం 150 రోజుల్లో 16,347 పోస్టులను భర్తీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. ఉపాధ్యాయుల పట్ల గత ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ, ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద విధుల్లో నిలబెట్టారని గుర్తుచేశారు. రాష్ట్రానికి సాగర్ డిఫెన్స్ వంటి రక్షణ రంగ పరిశ్రమలను తీసుకురావడంలో ఎన్డీఏ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. కావలి ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి కల్పించే ఈ పరిశ్రమను కూడా అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో ఎన్డీఏ ప్రభుత్వాల పాత్రను గుర్తుచేస్తూ, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి విశాఖ ఉక్కును కాపాడారని తెలిపారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు శాశ్వత అండగా నిలుస్తామని హామీ ఇచ్చామన్నారు. శాశ్వత ఉద్యోగుల కుటుంబాలకు రూ.2 కోట్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశం ప్రతిష్ఠ పెరగడానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో “డబుల్ ఇంజన్ ప్రభుత్వం” ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో “డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం” ఉందన్నారు. అమరావతి, పోలవరం నిధులు, విశాఖ రైల్వే జోన్, ఏఎంసీఏ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ వంటి అంశాలు ఈ సమన్వయానికి నిదర్శనమని చెప్పారు. రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, క్యారియర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు రావడం ఎన్డీఏ ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనమన్నారు. లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో “మిషన్ రాయలసీమ” అమలు చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు ఒక కుటుంబంలా పనిచేయాలని, చిన్న చిన్న సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అహంకారం వల్ల ఏమి జరుగుతుందో ప్రజలు ఇప్పటికే చూశారని, 151 స్థానాల నుంచి 11 స్థానాలకు పడిపోయిన ఉదాహరణ అందరికీ తెలుసన్నారు. గుజరాత్, ఒడిశా రాష్ట్రాల మాదిరిగా ప్రభుత్వ కొనసాగింపు వల్లే అభివృద్ధి సాధ్యమవుతుందని, పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం కొనసాగింపు అవసరమని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. చివరిగా, “ఎన్డీఏతో వికాసం -- గొడ్డలి పార్టీతో విధ్వంసం” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిస్తూ, తనకు ఈ అవకాశం కల్పించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్డీయే - ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దిక్సూచి! -డా.జి.దశరథాచారి,రాష్ట్ర కార్యదర్శి

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీ కాళహస్తి టౌన్

అరాచక సామ్రాట్ జగన్ రెడ్డిని గద్దె దించి ప్రజా ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన రెండేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాల రంగాల్లో సరి కొత్త చరిత్ర సృష్టించిన ఎన్డీయే కూటమి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి దిక్సూచిగా నిలిచిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి కొనియాడారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను వేద వాక్కులా భావించి, వాటిని అమలు చేయడానికి అహర్నిశలూ చిత్తశుద్ధితో పనిచేస్తున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ళలో సాధించిన ప్రగతిని, అందించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడానికి తిరుపతి పరిసరాలలో ఉన్న దామినేడు వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ విజయవంతం కావడం శుభపరిణామం అని కొనియాడారు. సూపర్ సిక్స్ హామీల అమలు నుంచి రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, పేదలకు



ప్రత్యక్షంగా లబ్ధి చేకూరేలా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దిక్సూచిగా మారిందని తెలిపారు. 24 నెలల ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్ల సాయం అందించి, లక్షలాది కుటుంబాల్లో విద్యా వెలుగులు నింపడం ద్వారా విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ స్వర్ణాంధ్ర నిర్మాణానికి మార్గం సుగమం చేసిన ఘనత చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వానిది అని కొనియాడారు. రెండేళ్ల కూటమి పాలనలో దివ్యాంగ శక్తి పథకం ద్వారా ఏపీయస్ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, వేలాది మంది దివ్యాంగులలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, దీని ద్వారా ప్రయాణ ఖర్చు భారం తగ్గి, అవసరమైన చోటుకు సులభంగా వెళ్లేలా లబ్ధిదారులలో కొండంత ఆనందాన్ని నింపడం జరిగిందని కొనియాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని కేవలం రెండేళ్ళ పాలనలో అమలు చేసి చూపించిన కూటమి ప్రభుత్వం. దీపం-2 పథకం ద్వారా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకులు ప్రభాకర్, కృష్ణమూర్తి, శ్రీకాళహస్తి నియోజకవర్గ బిజెపి నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# “వెన్నుపోటుకు రెండేళ్లు”

## ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ మరియు గూడూరు నియోజకవర్గ ఇన్చార్జ్ మేరిగ మురళీధర్ మరియు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

లి నిరసనలో పాల్గొన్న ముఖ్య నాయకులు ఎస్ ఇ సి సభ్యులు కొడవలూరు భక్తవత్సల రెడ్డి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేవూరు విజయ మోహన్ రెడ్డి మేరిగ మురళీధర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలు, మోసపూరిత మాటలు చెప్పి గద్దెనెక్కి నేటికి రెండేళ్లు పూర్తయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది ,ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదు ఎన్నికకు ముందు ప్రజలకు ఇచ్చిన బాండ్లు కేవలం చలి కాచుకోవడానికి తప్ప దేనికీ పనికిరావు కూటమి ప్రభుత్వం చేసిన మోసం ప్రజలకు ఇప్పుడు పూర్తిగా అర్థమైంది సాధారణంగా చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో ఎంతటి అసంతృప్తి, నిరసన ఉందో చెప్పడానికి మహిళలు సైతం స్వచ్ఛందంగా తరలివచ్చి చంద్రబాబు పాలనపై తమ అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైంది కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు,శ్రీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇలా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తామని చెప్పిన చంద్రబాబు.. ఈరోజు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక పెట్రోల్, డీజిల్ ధరలు ఉన్న రాష్ట్రంగా మార్చారు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలలో ఆంధ్ర రాష్ట్రం భారతదేశంలోనే మొదట స్థానం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్క హామీని కూడా అమలు చేయని పక్షంలో ప్రజలే వీటన్నిటికీ సాక్ష్యంగా వహించి ఆ ప్రభుత్వాన్ని మరల ఎన్నుకోవడం జరగదని చెప్పేసి ఈ కార్యక్రమం ద్వారా తెలియజేస్తున్నాను.

ఆడబిడ్డ ఆడబిడ్డ నీది నిరుద్యోగ భృతి 50 ఏళ్ల పైబడిన బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలకు పెన్షన్ అన్నదాత సుఖీభవ ఉచిత గ్యాస్ సిలిండర్ జాబ్ క్యాలెండర్ వంటి కీలక హామీలు ఇప్పటికీ చేయలేని సూపర్ సెక్స్ పథకాలను సూపర్ ఫ్లాప్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు రాష్ట్రవ్యాప్తంగా జనపరుబాట కొనసాగుతుందని ఈ కార్యక్రమంలో ద్వారా తెలియజేశారు. డీఎస్సీ అనేది లక్షలాది మంది నిరుద్యోగ యువత ఆశ పరీక్ష రాసిన తర్వాత



పిలిచి మరి సర్టిఫికెట్లు వెరిఫై చేసి వారికి ఉద్యోగాలు ఇవ్వలేదు 1:1 అంటే కూడా అర్థం కాని పరిస్థితిలో ఉంది ఈ కూటమి ప్రభుత్వం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మండల నాయకులు అనుబంధ విభాగాల అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాలువిద్యా సామగ్రి పంపిణీ

## పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యాశాఖ అధికారులు సందర్శన

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలో, వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలువిద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాలను మండల విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్ ముని సుబ్రహ్మణ్యం లు,నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. అలాగే,వేణుగోపాలపురం ఎంపీపీ పాఠశాలలో ఎస్ఎంసి వైస్ చైర్మన్ లక్ష్మి చిన్నారులకు పలకలు, బలపాలు, పుస్తకాలు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేసి, విద్యార్థులను సక్రమంగా విద్యాభ్యాసం కొనసాగించాలని ప్రోత్సహించారు ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





# ముక్కోటి అగస్త్యేశ్వరస్వామి దర్శనంతో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ ఆధ్యాత్మిక పరవశం

## ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ



ప్రజాభూమి ప్రతినిధి చంద్రగిరి
చంద్రగిరి మండలం తొండవాడ గ్రామం ముక్కోటిలో వెలసిన శ్రీ ఆనందవల్లి సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారిని శుక్రవారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ దర్శించుకున్నారు. ముక్కోటి ఆలయ ఫౌండర్ ట్రస్టీ మొగిలి ఇందుమౌళి రెడ్డి ఆహ్వానం మేరకు రెండవసారి రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముక్కోటి ఆలయానికి విచ్చేసిన సానా సతీష్‌కు ఆలయ అధికారులు, గ్రామ ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద నవీన్ కుమార్ రెడ్డి, సంజయ్ కుమార్ రెడ్డి, ప్రణీత్, సుభాష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉమాపతి రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, రాఘవేంద్ర, బాలకిషోర్ తదితరులతో పాటు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం శ్రీ ఆనందవల్లి సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం ఆలయ అర్చకులు ఆలయ చరిత్ర, విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత గురించి రాజ్యసభ సభ్యునికి వివరించారు. ఈ సందర్భంగా సానా సతీష్ మాట్లాడుతూ, ముక్కోటి క్షేత్రం ఆధ్యాత్మికంగా విశిష్టమైన పుణ్యక్షేత్రమని, ఇలాంటి ఆలయాల పరిరక్షణ, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ పరిసర ప్రాంతంలోని స్వర్ణముఖి నదిలో కొట్టుకుపోయిన కల్వర్టు సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఆలయానికి అనుబంధంగా గోశాల నిర్మాణానికి అవసరమైన సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దలు, ఆలయ సేవా సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధార్ లింక్ చేయకపోతే ప్రభుత్వ పథకాలు దూరం

## రైతులు అప్రమత్తంగా ఉండాలి : వ్యవసాయ అధికారి కే. షణ్ముగం

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని రైతులు తమ భూమి రికార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించవద్దని బి.ఎన్. కండ్రిగ వ్యవసాయ అధికారి కే. షణ్ముగం సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల ప్రయోజనాలు నేరుగా అర్హులైన రైతులకు చేరేలా భూమి రికార్డులు, ఆధార్ వివరాలు సరైన విధంగా నమోదు కావడం అత్యంత అవసరమని తెలిపారు. ప్రస్తుతం అనేక మంది రైతులు భూమి తమ పేరుపై ఉన్నప్పటికీ ఆధార్ లింక్ చేయకపోవడం, మొబైల్ నంబర్ మారినా అప్‌డేట్ చేయకపోవడం, వారసత్వ భూములను మ్యుటేషన్ చేయించుకోకుండా సాగు చేయడం వంటి కారణాల వల్ల ప్రభుత్వ పథకాల లబ్ధిని కోల్పోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ, పంట పెట్టుబడి సాయం, పంట బీమా, ప్రకృతి విపత్తుల నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే ఇతర ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. ఒకే ఆధార్‌ను పలువురు భూమి ఖాతాలకు లింక్ చేయడం, భూమి యజమాని మరణించిన తరువాత కూడా రికార్డులను



సవరించకపోవడం, 1-బి మరియు ఆధార్ వివరాల్లో పేర్లు భిన్నంగా ఉండడం వంటి తప్పులు రైతులు ఎక్కువగా చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి లోపాలను వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. రైతులు తమ భూమి పత్రాలు, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు అన్నీ ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలని అవసరమైతే గ్రామ,వార్డు సచివాలయం, రైతు భరోసా కేంద్రం లేదా రెవెన్యూ అధికారులను సంప్రదించి సవరణలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే ఒక్క పథకం కూడా మిస్ కాకుండా ఉండాలంటే ప్రతి రైతు తన భూమి రికార్డులను పరిశీలించి ఆధార్ లింక్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు. రైతుల అవగాహనతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాల పూర్తి ప్రయోజనాలు అందుతాయని ఆయన తెలిపారు.

# వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించడమే పీఎం స్వానిధి లక్ష్యం

## -డిజిటల్ లావాదేవీలతో ఆదాయం, గుర్తింపు పెరుగుతుంది -మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్. నాగరాజు

ప్రజాభూమి, హిందూపురం టౌన్
వీధి వ్యాపారుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచి, వారికి స్వయం ఉపాధిలో స్థిరత్వం కల్పించడమే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం స్వానిధి పథకం ప్రధాన లక్ష్యమని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్. నాగరాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా డీఎంసి గంగులయ్య ఆధ్వర్యంలో టౌన్ క్లాత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు, వాసుదేవ రెడ్డి, వివిధ బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, పీఎం స్వానిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు సులభ నిబంధనలతో రుణాలు అందించడంతో పాటు, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని చెప్పారు. కరోనా అనంతరం జీవనోపాధి కోల్పోయిన చిన్న వ్యాపారులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ పథకం కింద మొదటి విడతలో రూ.10 వేల వరకు, రెండో విడతలో రూ.20 వేల వరకు, మూడో విడతలో రూ.50 వేల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. రుణాలను సకాలంలో చెల్లించే



లబ్ధిదారులకు 7 శాతం వరకు వడ్డీ రాయితీ కూడా లభిస్తుందన్నారు. దీంతో వ్యాపారులు అధిక వడ్డీ రుణాల బారిన పడకుండా తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం వల్ల నగదు లావాదేవీలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో పాటు వ్యాపారంలో పారదర్శకత పెరుగుతుందన్నారు. యూపీఐ, క్యూ ఆర్ కోడ్‌ల ద్వారా చెల్లింపులు స్వీకరించే వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా అందిస్తోందని తెలిపారు. వీధి వ్యాపారులు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎం స్వానిధి పథకం ద్వారా వేలాది మంది చిన్న వ్యాపారులు లబ్ధి పొందుతున్నారని, అర్హులైన ప్రతి వ్యాపారి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బ్యాంక్ మేనేజర్లు మాట్లాడుతూ, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు యూపీఐ, క్యూ ఆర్ కోడ్ వినియోగంపై వీధి వ్యాపారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. నగదు రహిత లావాదేవీల వల్ల చెల్లింపులు వేగంగా, సురక్షితంగా జరగడంతో పాటు వ్యాపార లావాదేవీలకు స్పష్టమైన రికార్డు ఉంటుందని వివరించారు. ప్రస్తుతం వినియోగదారులు ఎక్కువగా గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి డిజిటల్ చెల్లింపు విధానాలను ఉపయోగిస్తున్నందున వ్యాపారులు కూడా సాంకేతికతకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా లావాదేవీలు నిర్వహించే వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపారు. ప్రతి డిజిటల్ లావాదేవీ వ్యాపారికి ఆర్థిక విశ్వసనీయతను పెంచడమే కాకుండా, భవిష్యత్తులో బ్యాంకు రుణాలు పొందేందుకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపులను నిరంతరం వినియోగిస్తూ అధిక సంఖ్యలో లావాదేవీలు నిర్వహించే వ్యాపారులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ఈ ప్రోత్సాహకాలు వ్యాపారుల్లో డిజిటల్ చెల్లింపులపై మరింత ఆసక్తి పెంచి, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకుల ప్రతినిధులు, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ నిఘా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం - కడప జిల్లా ఎస్పీ నచికేత్ షేల్కే విశ్వనాథ్

ప్రజాభూమి పోరుమామిళ్ల :
వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా కడప జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నచికేత్ షేల్కే విశ్వనాథ్ చేతుల మీదుగా అధునాతన డ్రోన్ కెమెరాను గాల్లోకి ఎగురవేసి అధికారికంగా ప్రారంభించారు. స్మార్ట్ పోలీసింగ్‌లో మరో ముందడుగు: పోరుమామిళ్లలో డ్రోన్ నిఘాను ప్రారంభించిన కడప ఎస్పీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కడప జిల్లా పోలీస్ శాఖ స్మార్ట్ పోలీసింగ్ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం పోరుమామిళ్ల మండలం లోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక నిఘా కోసం కేటాయించిన అధునాతన డ్రోన్ కెమెరాను కడప జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ తన చేతుల మీదుగా గాల్లోకి ఎగురవేసి, ఈ డ్రోన్ సర్వైలెన్స్ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో




ఎస్పీ తో పాటు అడిల్ ఎస్పీ ప్రకాష్ బాబు, మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్, పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ హేమ సుందర్ స్థానిక ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. సీఐ ఆఫీస్ ప్రాంగణం నుండి డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ, దాని ద్వారా లభించే విజువల్స్ మరియు కంట్రోల్ సిస్టమ్‌ను ఎస్పీ స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై గగనతల నిఘాఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. సమాజంలో నేరాల నియంత్రణకు, అసాంఘిక శక్తుల



ఆటకట్టించడానికి సాంకేతికత ఎంతో దోహదపడుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా పోరుమామిళ్ల పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా, జూదం, గుట్కా అమ్మకాలు, ఇసుక అక్రమ రవాణా వంటి అక్రమ కార్యకలాపాలపై ఇకనుంచి ఈ డ్రోన్ల ద్వారా డేగ కన్ను వేయనున్నట్లు తెలిపారు. మనుషులు వెళ్లలేని మారుమూల ప్రాంతాలు, దట్టమైన పొదలు లేదా గుట్టల వెనుక జరిగే తవ్వకాలు, అనుమానాస్పద కదలికలను ఈ డ్రోన్ కెమెరాలు ఇట్టే పసిగడతాయని ఆయన వివరించారు. ట్రాఫిక్ నియంత్రణ, పండుగ బందోబస్తుకు సైతం. కేవలం నేరాల గుర్తింపే కాకుండా, పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు, పెద్ద ఎత్తున ప్రజలు గుమిగూడే పండుగలు, జాతరలు, మరియు రాజకీయ నిరసనల సమయంలో శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు ఈ డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఈ డ్రోన్ ప్రత్యక్ష విజువల్స్ పంపడం ద్వారా త్వరితగతిన స్పందించి అవాంఛనీయ సంఘటనలను అరికట్టవచ్చని చెప్పారు. నేరస్థులకు గట్టి హెచ్చరిక పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఈ డ్రోన్ నిఘా ద్వారా నిందితులను ఆధారాలతో సహా పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గారు హెచ్చరించారు. ప్రజల భద్రతకు తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని, సాంకేతికతను జోడించి ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో డ్రోన్ ఆపరేటింగ్ విధానాన్ని సిబ్బంది ఎస్పీ కి ప్రదర్శించి చూపగా, స్థానిక ప్రజలు మరియు వ్యాపారస్తులు పోలీస్ శాఖ తీసుకున్న ఈ హైటెక్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఇకపై పోరుమామిళ్ల ప్రాంతంలో నిఘా మరింత పటిష్టం కానుందని వెల్లడించాయి.

# సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న బలిజ సంఘం నాయకుడు ఎడాల బ్రదర్స్ , ఎడాల సుబ్రహ్మణ్యం కుమారుడు బెంగళూరులో ఇంజనీరింగ్ చదువుతూ మోటర్ బైక్ మీద బెంగళూరు వెళ్తూ యాక్సిడెంట్లో ఇటీవల మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇన్చార్జి మనోహర్ రెడ్డి లు శుక్రవారం వారి



నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అధైర్యపడవద్దని అన్ని విధాల పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్ర మంలో బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురు ప్రసాద్, శివయ్య, వెంకటసుబ్బయ్య, సోపాల వీర, వైకాప నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ పాలన సూపర్ సక్సెస్ పాలన

## -ప్రజా సమస్యల పరిష్కారంకోసమే ప్రజా దర్బార్

ప్రజాభూమి,పులివెందుల
కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన సూపర్ సక్సెస్ అయిందని, రైతుల ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వామని, రాష్ట్రంలో వైకాపా పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని , ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి అన్నారు.



శుక్రవారం పులివెం దుల పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గం నుండి వచ్చిన ప్రజల నుండి పలు సమస్యలను సావదా నంగా విని , వారిచ్చిన అర్జీలనుస్వీకరించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాను అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకటి ఒకటి నెరవేర్చుకుంటూ వస్తుందన్నారు. వైకాపా నాయకులు కూటమి ప్రభుత్వంపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారన్నారుఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతి విమానాశ్రయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం

## శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి రూరల్
కూటమి ప్రభుత్వ రెండేళ్ల అద్భుత ప్రగతి ప్రస్థాన విజయోత్సవ బహిరంగ సభలో పాల్గొనేందుకు తిరుపతి దామినేడు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి తిరుపతి విమానాశ్రయంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసిన కొట్టే సాయి ప్రసాద్,



రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన, పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు మోడీ నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగు తోందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవ సభ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ సాధించిన విజయాలను తెలియజేసే వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు అభిమానులు పాల్గొన్నారు.



# మామిడి రైతులను ఆదుకోవాలి

## - మల్లం చంద్రమౌళిరెడ్డి..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక చిత్తూరు జిల్లా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మల్లం చంద్రమౌళిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పంట సాగుకు భారీగా పెట్టుబడులు పెట్టిన రైతులకు ప్రస్తుతం మార్కెట్ లో సరైన ధర లభించడం లేదని, దీంతో మామిడి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతులకు అవసరమైన మద్దతు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను గుర్తించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, ధరల స్థిరీకరణ చర్యలు చేపట్టి మామిడి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే మెప్మా లక్ష్యం

**-సంఘాల బలోపేతం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**
**-సీఓలు, ఆర్పీల సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు**




ప్రజాభూమి, హిందూపురం టౌన్
మహిళల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతమే మెప్మా ప్రధాన లక్ష్యమని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా డీఎంసీ గంగులయ్య ఆధ్వర్యంలో సీఓలు, ఆర్పీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర, అక్షరాంధ్ర కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు పెద్దఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. మెప్మా పంచసూత్రాలను ప్రతి సంఘం ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి పొదుపులు, అంతర్గత రుణాలు, రుణాల సకాలంలో చెల్లింపులు, లెక్కల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హిందూపురం పురపాలక సంఘ పరిధిలో మహిళా సంఘాలకు రూ.146.48 కోట్ల రుణాలు అందించడం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి సహకారం అందిందన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందేలా సీఓలు, ఆర్పీలు మార్గనిర్దేశం చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా జీవనోపాధుల అధికారి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, ప్రతి మహిళా సంఘంలోని సభ్యుల నైపుణ్యాలను గుర్తించి, వారికి అవసరమైన రంగాల్లో ప్రత్యేక శిక్షణలు అందించాలని సూచించారు. మహిళల ఆదాయాన్ని పెంచే జీవనోపాధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని తెలిపారు. బ్యాంక్ లింకేజీ అధికారిణి మాధవి మాట్లాడుతూ, మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా మరింత ఆర్థిక సహకారం అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సంఘాల పనితీరు మెరుగ్గా ఉంటే మరిన్ని రుణ సదుపాయాలు లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఓలు, ఆర్పీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# 132 కేవీ తుమకుంట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

## -నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాభూమి, హిందూపురం టౌన్
132 కేవీ తుమకుంట సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతుల పనుల కారణంగా హిందూపురం గ్రామీణ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ అసిస్టెంట్ ఇంజనీర్ జబీవుల్లా తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. గొల్లాపురం, తూమకుంట, చౌళూరు, సంతేబిదనూరు, బేవినహళ్లి, ఊడుగులపల్లి, నక్కలపల్లి, సంజీవరాయనపల్లి, కిరికెర, బసనపల్లి, దేవరపల్లి, కొటిపి, కగ్గల్లు, సుబ్బిరెడ్డిపల్లి, అప్పలకుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజాభూమి

జనరల్ 12

శనివారం 13, జూన్ 2026

## పెడనలో వైఎస్సార్‌సీపీ ధర్మాగ్రహం.. ఘనంగా వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి–పెడన

పెడన నియోజకవర్గంలో రాజకీయ సెగలు రేగాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రోడ్డెక్కాయి. నియోజకవర్గ ఇంచార్జ్ ఉప్పాల రాము ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం అత్యంత విజయవంతంగా, భారీ ప్రజా బలంతో సాగింది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి బంటుమిల్లి రోడ్డు వరకు సాగిన ఈ నిరసన ర్యాలీలో పార్టీ శ్రేణులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని తమ నిరసన స్వరాన్ని వినిపించారు.

**ముఖ్య అతిథులు – ప్రజా ప్రతినిధులు**

ఉప్పాల రాము (పెడన నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్), ఉప్పాల హారిక (కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్),మైలా రత్నకుమారి (జోన్–3 ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్) ఇది ప్రజాద్రోహానికి వ్యతిరేకంగా సాగిన ప్రజా రణం..ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం జరిగిన వెన్నుపోటు రాజకీయాన్ని ప్రజలు ఎప్పటికీ మరువరని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వారికి కాలమే బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక , జోన్–3 ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ మైలా రత్న కుమారి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని, ఇటువంటి వెన్నుపోటు రాజకీయాలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.రద్దీగా మారిన బంటుమిల్లి రోడ్డు పార్టీ కార్యాలయం నుండి బంటుమిల్లి రోడ్డు వరకు సాగిన భారీ ర్యాలీతో పెడన పట్టణం అట్టుడికిపోయింది.ఆకట్టుకున్న ప్లకార్డులు వెన్నుపోటు రాజకీయాలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పట్టుకున్న ప్లకార్డులు, నినాదాలు పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కదం తొక్కిన క్యాడర్ ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉప్పాల రాము నాయకత్వానికి జై కొట్టారు.

## శరీరానికి బలం, మనసుకు ప్రశాంతత, జీవితానికి సమతుల్యత యోగతోనే సాధ్యం...

- యోగ వ్యాయామం కాదు సంపూర్ణ జీవన విధానం...
- శ్వాసను నియంత్రించే యోగ జీవితం క్రమశిక్షణతో నడిపించే శక్తిని ఇస్తుంది...
- యోగం ద్వారా ఒత్తిడి తగ్గి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది..
- ప్రజా ఉద్యమంగా యోగాంధ్ర ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలి...
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ:

శరీరానికి బలం, మనసుకు ప్రశాంతత, జీవితానికి సమతుల్యత యోగతోనే సాధ్యమవుతుందని యోగ కేవలం వ్యాయామం కాదని సంపూర్ణ జీవన విధానానికి మార్గమని శ్వాసను నియంత్రించి జీవితాన్ని క్రమశిక్షణతో నడిపించే శక్తి యోగ ద్వారానే వస్తుందని ఒత్తిడిని తగ్గించి ఆత్మావిస్వశాన్ని పెంచే యోగాను ప్రతి ఒక్కరూ దిన చర్యలతో ఒక భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న “యోగాంధ్ర” కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భవానిపురంలోని బెరం పార్కు నందు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్ని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని అది సంపూర్ణ జీవన విధానమని అన్నారు. శ్వాసను నియంత్రించే యోగ మనిషికి శారీరక మానసిక ఆరోగ్యాన్ని అందించడమే కాకుండా జీవితాన్ని క్రమశిక్షణతో నడిపించే శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో యోగ ఎంతో అవసరమని చెప్పారు. యోగ సాధన ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. ప్రతిరోజూ కేవలం 45 నిమిషాల సమయాన్ని కేటాయించి కామన్ యోగా ప్రోటోకాల్‌ను అనుసరిస్తే, ఆరోగ్య పరంగా అత్యున్నత స్థాయి యోగా సాధన ద్వారా లభించే ప్రయోజనాల్లో దాదాపు 60 నుంచి 70 శాతం ప్రయోజనాలు పొందవచ్చని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ప్రజా ఉద్యమంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాభ్యాసంలో భాగస్వాములు కావాలని ఆరోగ్యవంతమైన, ఆనందమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని అన్నారు. ఆరోగ్యవంతమైన పౌరులే రాష్ట్ర, దేశ అభివృద్ధికి బలమైన పునాది అని భావించి గౌరవ ప్రధానమంత్రి, గౌరవ ముఖ్యమంత్రి యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ జిల్లా నోడల్ ఆఫీసర్ డా. ప్రియదర్శిని, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ షమ్మి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ పి. శ్రీనివాసరావు, సెంట్ ఆన్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటరు దేవుళ్లకు అలర్ట్ జూన్ 15 నుంచి ఇంటింటికీ బిఎల్‌ఓలు

- ఫారమ్‌లు ఇవ్వకపోతే ఓటరు జాబితా నుంచి పేరు అవుట్
- స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ –2026 షెడ్యూల్ విడుదల
- ప్రకటించిన మచిలీపట్నం ఈఆర్వో, ఆర్డీవో కే. సాంబశివరావు.



ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ – 2026’ కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. ఈ మహా క్రతువులో ప్రతి ఓటరూ భాగస్వామి కావాలని 75–మచిలీపట్టణం అసెంబ్లీ నియోజకవర్గ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో), బందరు ఆర్డీవో కే. సాంబశివ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఉత్తర మండల తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన కీలక వివరాలను వెల్లడించారు. ముఖ్యమైన తేదీలు – ఓటరు టైమ్‌లైన్ ఇంటింటికీ బిఎల్‌ఓల సర్వే జూన్ 15 -- జూలై 14, 2026 బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వచ్చి ప్రీ–ప్రింటెడ్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందించి, తిరిగి సేకరిస్తారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జూలై 21, 2026 అందిన ఫారమ్‌ల ఆధారంగా రూపొందించిన డ్రాఫ్ట్ (ముసాయిదా) ఓటరు జాబితాను విడుదల చేస్తారు.అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జూలై 21 – ఆగస్టు 20, 2026 జాబితాపై ఏవైనా తప్పులున్నా, అభ్యంతరాలున్నా దరఖాస్తు చేసుకోవడానికి నెల రోజుల గడువు ఉంటుంది.ఓటర్లు గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయాలు ఫారమ్ ఇవ్వకపోతే పేరు తొలగింపు: బిఎల్‌ఓలు ఇచ్చే ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూర్తిగా నింపి తిరిగి ఇవ్వాలి (లేదా ఆన్‌లైన్‌లో సమర్పించాలి ). ఫారమ్‌లు ఇవ్వని వారి పేర్లు ముసాయిదా జాబితాలో ఉండవు.డాక్యుమెంట్లు అవసరం లేదు: ఈ సర్వే ప్రక్రియలో ఓటర్ల నుంచి ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేదా ఇతర డాక్యుమెంట్లు తీసుకోరు.2002 ఓటరు జాబితాతో అనుసంధానం: మీ వివరాలను 2002 నాటి ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితాలతో అనుసంధానం చేసుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక లింక్, జిల్లా వెబ్‌సైట్‌లో పాత జాబితాలను అందుబాటులో ఉంచింది. వ్యత్యాసాలు ఉంటే ఈఆర్వో నోటీసులు జారీ చేస్తారు. ఏకపక్షంగా తొలగింపులు ఉండవు: ముసాయిదా జాబితాలో ఉన్న ఏ ఓటరు పేరునైనా పూర్తి విచారణ జరపకుండా, సదరు వ్యక్తికి వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండా తొలగించే ప్రసక్తే లేదు.కొత్త ఓటర్లకు సువర్ణావకాశం! 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు ఓటరుగా నమోదు కావడానికి ఆన్‌లైన్ ద్వారా లేదా ‘ఫారం–6’ పూరించి, అవసరమైన పత్రాలతో పాటు బిఎల్ఓ లేదా తహశీల్దార్ కార్యాలయంలో సమర్పించవచ్చు.రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి.. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి తమ బూత్ లెవెల్ ఏజెంట్లను (బీఎల్ఏ) తక్షణమే నియమించుకోవాలని, బిఎల్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ ఈ సవరణ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా జరిగేలా సహకరించాలని ఆర్డీవో కోరారు.ఈ సమావేశంలో మచిలీపట్నం ఉత్తర, దక్షిణ మండలాల తహసిల్దార్లు వి. నాగభూషణం, కే. రామ శివ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ చోడవరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పాలకుల నజర్.. నిర్దేశిత గడువులోగా అర్జీల పరిష్కారం

- గత మూడు వారాల పిటిషన్లపై జిల్లాల్లో ముమ్మర కార్యాచరణ.
- ప్రతి సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ రివ్యూ.. అధికారుల నిర్లక్ష్యానికి తావు లేదు.
- మీకోసం వేదికగా పెడనలో వినతుల స్వీకరణ: జిల్లా ఇన్‌చార్జి డీఆర్‌ఓ పి. పోతురాజు.

ప్రజాభూమి బ్యూరో–కృష్ణాజిల్లా

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. పెడన నియోజకవర్గంలో గత నాలుగు వారాలుగా అందిన అన్ని పిటిషన్లను పూర్తిస్థాయిలో పరిష్కరించి, క్షేత్రస్థాయిలో అసంతృప్తికి తావులేకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని జిల్లా ఇన్‌చార్జి డీఆర్‌ఓ పి. పోతురాజు స్పష్టం చేశారు.శుక్రవారం ఉదయం పెడన మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక ‘మీకోసం’ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బందరు ఆర్డీవో కే. సాంబశివరావు, జెడ్పీ సీఈవో డాక్టర్ జే. అరుణ, డిప్యూటీ సీఈఓ డాక్టర్ ఆనంద్ కుమార్‌లతో కలిసి ఆయన ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించారు.

**అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: డీఆర్‌ఓ హెచ్చరిక**

ఈ సందర్భంగా డీఆర్‌ఓ పోతురాజు మాట్లాడుతూ, అందిన ప్రతి పిటిషన్‌ను వెంటనే అధికారిక పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. వీటిపై తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ ప్రతి సోమవారం గ్రీవెన్స్ సమావేశంలో ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. ఉన్నతాధికారులు, ముఖ్య కార్యదర్శి స్థాయిలోనే నిరంతర పర్యవేక్షణ ఉన్నందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి అని ఆదేశించారు. సమస్య సాధ్యం కాని పక్షంలో అర్జీదారులకు సరైన కారణాలు వివరించాలని స్పష్టం చేశారు.

**సమస్యల సత్వర పరిష్కారంతో తగ్గిన అర్జీల రద్దీ!**

“ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక గ్రీవెన్స్ వల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు స్థానికంగానే పరిష్కారమవుతున్నాయి. గత మూడు వారాలతో పోలిస్తే నాలుగో వారానికి పెడనలో అర్జీల సంఖ్య గణనీయంగా తగ్గడమే ఈ కార్యక్రమ విజయానికి నిదర్శనం.డా.జే. అరుణ, జెడ్పీ సీఈవో (పెడన నియోజకవర్గ ప్రత్యేక అధికారి) మీకోసం వేదికకు పోటెత్తిన ప్రధాన




సమస్యలు ఇవే..ఈ వారం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని కీలక వినతులు, స్థానిక ఇబ్బందుల వివరాలు ఇలా ఉన్నాయి: వార్డు 12, 13లలో డ్రైనేజీ కష్టాలు: కొత్త డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో సుమారు 70 కుటుంబాలు మురుగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, ప్రజారోగ్యం దృష్ట్యా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు వినతిపత్రం ఇచ్చారు.ఎన్టీఆర్ కాలనీలో లో–వోల్టేజ్ సమస్య: 11వ వార్డు పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో చాలా కాలంగా తక్కువ వోల్టేజ్ సమస్యతో గృహోపకరణాలు పాడవుతున్నాయని, వెంటనే 3–ఫేజ్ విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని నివాసితులు కోరారు. రూ.20 లక్షల కబేళా నిరుపయోగం: పట్టణ పరిధిలో లక్షల వ్యయంతో నిర్మించిన కబేళాను మూసివేయడం వల్ల మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోందని, కొందరు ఇళ్ల వద్దే జంతువులను వధిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదు అందింది.

చేపల మార్కెట్‌లో షెడ్ల అవసరం: 16వ వార్డు చేపల మార్కెట్ వారపు సంతకు వచ్చే దూర ప్రాంత వ్యాపారులు ఎండ, వానలకు ఇబ్బంది పడుతున్నారని, మున్సిపల్ సుంకాలు వసూలు చేస్తున్నందున అక్కడ షెడ్లు నిర్మించాలని కోరారు.

**హాజరైన అధికారులు**

ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొండయ్య, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమ శేఖర్, డి ఎల్ పి ఓ రజావుల్లాతో పాటు తహసీల్దారులు, ఎంపీడీవోలు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాగ్దానాలు చేయటం, అమలు చేయకపోవడంమే బాబు నైజం

- అప్పులకు, అరాచకాలకు, అవినీతికి నిలియంగా ఆంధ్రప్రదేశ్
- జగ్గయ్యపేట వైయస్సార్ కాంగ్రెస్ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు
- జగ్గయ్యపేటలో వెన్నుపోటుకు రెండేళ్లు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో భారీ నిరసన

జగ్గయ్యపేట

వాగ్దానాలు చేయటం అమలు చేయకపోవడం చంద్రబాబు నైజమని అమలు చేయని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనతో అప్పులకు అరాచకాలకు అవినీతికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ మారింది అంటూ ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వం పై ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కోదాడ రోడ్ లోని వైయస్సార్ విగ్రహం, బస్టాండ్ సెంటర్, నెహ్రూ చౌక్, కన్యాకుమారి పాన్ షాప్, పొట్టి శ్రీరాములు విగ్రహం, సాయి బాబా గుడి, ఫైర్ స్టేషన్, తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్–ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు , జగ్గయ్యపేట నియోజకవర్గ పరిశీలికలు ఆళ్ల చల్లారావు , రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ మరియు వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు తో సహా నేతలు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లు గడిచినా వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళలు, యువత, రైతులు, నిరుద్యోగులు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చారని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి



స్తోందని ఆరోపించారు. జగ్గయ్యపేటలో టి.టి.డి కళ్యాణ మండపం ప్రారంభమైతే సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం లభిస్తుందని, అలాగే హైవే బస్టాండ్ వినియోగంలోకి వస్తే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. అయితే ఈ రెండు పనులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై స్థానిక శాసనసభ్యుడుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే టి.టి.డి కళ్యాణ మండపం, హైవే బస్టాండ్‌ను ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని, డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన మెగా డీఎస్సీ వాస్తవానికి నిరుద్యోగ యువతకు “దగా డీఎస్సీ”గా మారింది మెగా డీఎస్సీ పేరుతో ప్రచారం చేసుకుంటూ యువతను మభ్యపెట్టడం సరికాదని, రాష్ట్రంలోని అన్ని ఖాళీలను గుర్తించి వెంటనే పూర్తి స్థాయి డీఎస్సీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, యువత ఆవేదనకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రెండేళ్లుగా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. వైఎస్ఆర్ సీపీ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై వైఎస్ఆర్ సీపీ నిరంతరం పోరాడుతుందని, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామాల నాయకులు , మహిళలు, కార్యకర్తలు, భారీ ఎత్తుగా పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానుల ప్రదర్శనతో పేట విధులు జన సందోహంతో నిండిపోయాయి.

## డిజిటల్ బాటలో వ్యవసాయం యాప్ ద్వారానే ఎరువుల ఆర్డర్

- కృష్ణా జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఫెర్టిలైజర్స్ డిస్ట్రిబ్యూషన్
- చిన్నాపురం పిఎసిఎస్ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, పాల్గొన్న మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచెనాని, కాగిత వెంకటేశ్వరరావు
- మచిలీపట్నం మండలానికి ఖరీఫ్‌లో 21,352 ఎకరాలకు సరిపడా ఎరువుల కేటాయింపు

ప్రజా భూమి ప్రతినిధి–మచిలీపట్నం/రూరల్

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రైతాంగానికి నేరుగా సబ్సిడీ ఎరువులను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం చిన్నాపురం గ్రామంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఫెర్టిలైజర్స్ డిస్ట్రిబ్యూషన్’ పైలట్ ప్రాజెక్ట్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని ఎరువుల దుకాణాలు, సొసైటీల ద్వారా యాప్ ఆధారంగా ఎరువుల పంపిణీని ఎలా చేపట్టాలో రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు.ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే దుర్గా ప్రసాద్ (నాని) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కృష్ణా జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఐఐ) ఏ. నాగభూషణం, అసిస్టెంట్ డైరెక్టర్ మణిధర్, ఘంటసాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.వెంకటలక్ష్మి (ఖేత్ బచావో అభియాన్ పంటల సంరక్షణ ప్రచారంలో భాగంగా) పాల్గొన్నారు.జొమాటో తరహాలోనే ఎరువుల ఆర్డర్: మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు సభలో అధ్యక్షత వహించిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సబ్సిడీ ఎరువులు పక్కదారి పట్టకుండా, పరిశ్రమల పరం కాకుండా కేవలం పంటలు పండించే నిజమైన రైతులకు మాత్రమే అందేలా చూసేందుకు రాష్ట్రంలో కృష్ణా, కాకినాడ జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయడం సంతోషదాయకమన్నారు. మనం ఫోన్ పే ద్వారా డబ్బులు ఎలా పంపిస్తున్నామో, జొమాటో యాప్ ద్వారా ఆహారాన్ని ఎలా ఆర్డర్ చేసుకుంటున్నామో.. అదే విధంగా క్యూఆర్ కోడ్ మరియు యాప్ ద్వారా



పంటలకు కావలసిన ఎరువులను రైతులు సులువుగా ఆర్డర్ చేసుకోవచ్చు.అని ఆయన వివరించారు.కౌలు రైతులకు 3 డోసుల ఎరువులు.. ఖరీఫ్‌కు సర్వం సిద్ధం: ఐఐ నాగభూషణం వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఏ. నాగభూషణం మాట్లాడుతూ, కౌలు రైతులకు సైతం వారు సాగు చేసే పంటలకు మూడు డోసులకు సరిపడా ఎరువులను సక్రమంగా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.ఖరీఫ్ ప్రణాళిక: గత ఏడాది ఈ–క్రాప్ నమోదైన వివరాల ప్రకారం.. మచిలీపట్నం మండలంలోని 21,352 ఎకరాలకు సరిపడా ఎరువులను ఈ ఖరీఫ్ సీజన్ కోసం కేటాయించారు.ముందస్తు సరఫరా: ఏ నెలలో ఏ పంటకు ఎంత ఎరువు అవసరమో ముందే అంచనా వేసి, సొసైటీలు మరియు రిటైల్ డీలర్ల ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉంచుతామని తెలిపారు.ఈ అవగాహన సదస్సులో పిఎసిఎస్ డైరెక్టర్లు కంచర్ల వెంకటేశ్వరరావు, కాగిత వెంకటేశ్వరరావు, సిహెచ్. వెంకట రమణారావు, ఆర్. సత్యనారాయణ, కేసన రమేష్ బాబు, కాత్రా నాంచారయ్య, నూకల నాగ పున్నారావులతో పాటు మండల వ్యవసాయ అధికారి ఎం. రామ్ కుమా ర్, సొసైటీ సెక్రటరీ శ్రీనివాసరావు మరియు పెద్ద సంఖ్యలో ప్రాంతీయ రైతులు పాల్గొన్నారు.

Printed by MOHANEESWARPUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at East Godavari and published at d.no.70-7-28/1A, KRISHNA NAGAR, SBI COLONY PARK RAMANAYYA PETA KAKINADA editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1470.cell:9502116677.